నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
1
మంగళవారం | 06 ఆగస్టు 2024 | www.navatelangana.com

ఇందిరమ్మ పాలనలో మహిళలపై దాడులా



నవ తెలంగాణ-సిద్దిపేట

పోలీసులు దళిత మహిళ పట్ల ప్రవర్తించిన తీరు సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉందని, ఇందిరమ్మ పాలనలో మహిళలపై దాడులు జరగడం న్యాయమా అని ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సిద్దిపేటలో ఆయన మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా షాద్‌నగర్ దొంగతనం అంగీకరించాలంటూ దళిత మహిళ సునీత, ఆమె భర్త భీమయ్య పై పోలీసులు థర్డ్ డిగ్రీ ఉపయోగించడాన్ని ఎమ్మార్పీఎస్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. దంపతులను చిత్రహింసలకు గురిచేసిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. షాద్‌నగర్ ఇన్స్పెక్టర్ డిఐ రామ్ రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. సునీత, భీమయ్య కుటుంబానికి న్యాయం చేయాలని, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, మూడు ఎకరాల భూమి, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆయనతోపాటు సంఘం నాయకులు పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్



నవతెలంగాణ -నంగునూరు

నంగునూరు మండల కేంద్రంలో పోలీసులు పలు రకాల వాహనాలను సోమవారం సాయంత్రం ఐదు గంటల నుంచి ఏడు గంటల వరకు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ప్రధాన వీధుల్లో తిరుగుతూ వాహనాల తనిఖీలు చేశారు. నంబర్ లేని వాహనాలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కిరాణషాపులను సోదా చేశారు. గంజాయి తదితర మత్తు పదార్థాలను పట్టుకునేందుకు డాగ్ స్క్వాడ్ బృందాలను దింపారు. ఈ తనిఖీలో సిద్దిపేట ఏసీపీ మధు, సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, దుబ్బాక సీఐ శ్రీనివాస్, సిద్దిపేట రూరల్ ఎస్సై అపూర్వ రెడ్డి,రాజగోపాల్ పేట ఎస్సై ఎం.డి.ఆసీఫ్, ఎస్సై లు చంద్రయ్య, వెంకట్ రెడ్డి, ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుల్స్, వివిధ మండలాల పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ తగాదాలతో వివాహిత అదృశ్యం

నవతెలంగాణ-సంగారెడ్డి



కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత ఇద్దరి పిల్లలతో అదృశ్యమైంది. ఈ ఘటన సంగారెడ్డి పట్టణం ప్రగతినగర్‌లో జరిగింది. సంగారెడ్డి పట్టణ సిఐ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. కిరాయికి ఉంటున్న శ్రీలత తన ఇద్దరు పిల్లల తో కలిసి అదృశ్యం అయినా సంఘటన సంగారెడ్డిలో చోటు చేసుకుంది. రాయికోడ్ మండల కేంద్రానికి చెందిన మంగలి వెంకటేష్, శ్రీలత దంపతులు బతుకు దెరువు కోసం సంగారెడ్డికి వచ్చి ప్రగతినగర్‌లో కిరాయికి ఉంటున్నారు. వెంకటేష్ మంగలి పని చేసుకుంటూ పోషిస్తున్నాడు. అయితే కుటుంబ విషయంలో గొడవలు రావడంతో ఈనెల 4న శ్రీలత ఐదేండ్ల లోపు గల తన ఇద్దరి పిల్లలతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యుల వద్ద, తెలిసిన వాళ్ల దగ్గర వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దాంతో సోమవారం రోజున పోలీస్‌స్టేషన్‌లో వెంకటేష్ ఫిర్యాదు చేశాడు. ఆచూకీ తెలిసినవారు సంగారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ 8712661830, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్: 8712656718 కు సమాచారం ఇవ్వాలన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



నవతెలంగాణ-మునిపల్లి

ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్ టి యు సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి మదన్ గోపాల్ డిమాండ్ చేశారు. పి ఆర్ టి యు ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా సోమవారం నాడు మండలంలోని గార్లపల్లి,లోని కలాన్ తో పాటు వివిధ పాఠశాలల్లో సంఘం సభ్యత్వ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మదన్ గోపాల్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పిఆర్టియు తీవ్ర కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. ఇటీవల ఎన్ని కోర్టు కేసులు ఉన్నప్పటికీ 30 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించడంలో పి ఆర్టియు ఉపాధ్యాయ సంఘం కీలక పాత్ర పోషించిందని మదన గోపాల్ చెప్పుకొచ్చారు. ఉపాధ్యాయులకు పిఆర్సి లో 50శాతం ఫిట్మెంట్ కల్పించాలని మదన్ గోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమంలో పిఆర్టియు మునిపల్లి మండల శాఖ అధ్యక్షులు చంద్రమౌళి సంఘం నాయకులు సిద్దేశ్వర్, పోశెట్టి వీరన్న, ప్యాట ఉమేష్, భాను ప్రకాష్,మల్లికార్జున్ సురేందర్,భాస్కర్‌రెడ్డి, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్స్ వెంటనే విడుదల చేయాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

పెండింగ్ బిల్స్ వెంటనే విడుదల చేయాలని.. తరగతికి ఒక టీచర్‌ను ఇచ్చి ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్య దర్శి బి.సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో సంగారెడ్డి మండలంలోని జడ్పీహెచ్ఎస్ (గర్ల్స్) సంగారెడ్డి, జీఎన్‌హెచ్ఎస్ సంగారెడ్డి, మహాత్మ జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఏడాది నుంచి పెండింగ్లో ఉన్న జీపీఎఫ్ పార్ట్ ఫైనల్, లోన్స్, ఫైనల్ పేమెంట్స్, టిఎస్జిఎల్ఐ లోన్స్, ఫైనల్ పేమెంట్స్ ,సప్లమెంటరీ బిల్స్, సరెండర్స్ తదితర బిల్స్ పెండింగ్లో ఉన్నాయని.. వాటన్నింటిని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు ప్రాథమిక పాఠశాలల్లోని 3 తరగతులు చేర్చి ప్లే స్కూల్ చేస్తామనే ఆలోచన సరికాదన్నారు. దాన్ని విరమించుకొని, ప్రాథమిక పాఠశాలల్లో క్లాస్‌కి ఒక టీచర్, క్లాసుకు ఒక గదితో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసి బలోపేతం చేయాలని కోరారు. పదోన్నతులు, బదిలీల తర్వాత హైస్కూల్ల లో ఇంకా కొన్ని సబ్జెక్టు టీచర్ల కొరత ఉన్నందున మిగిలిపోయిన పదోన్నతులు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నార్మ్స్ కనుగుణంగా ఉపాధ్యా యుల వర్క్ అడ్జస్ట్మెంట్ పారదర్శకంగా నిర్వహి ంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌య యూటీఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు ఎం. సుచరిత, వై. సైమన్, సంగారెడ్డి మండల నాయకులు సూర్యనారాయణ శర్మ, బి. కమలాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి



నవతెలంగాణ-కొండాపూర్

విద్యారంగా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ వాణి డిమాండ్ చేశారు. కొండాపూర్ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ నూతన కన్వినింగ్ కమిటీ మీటింగ్‌ను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాణీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించిందన్నారు. గత ఆరేండ్లుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ రూ.7,792 కోట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా పెరిగిన ధరలకు అనుగుణంగా స్కాలర్ షిప్ పెంచాలన్నారు. సంక్షేమ వసతి గృహా విద్యా ర్థులకు మేస్ కాస్మొటిక్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. స్కాలర్షిప్ తో సంబంధం లేకుండా విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ చదువుతున్న విద్యా ర్థులకు ఫీజు ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. తక్షణమే విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చొరవ చూపాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో కొండాపూర్ ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు ప్రశాంత్, అర్జున్ మండల కన్వీనర్ సింధు, కో కన్వీనర్ సుమాయ, మండల కమిటీ సభ్యులు సమీరా, సాజిదా, హరి శంకర్, సోహెల్, క్రిష్ణ,అమీర్, సందీప్, శ్రీధర్ పాల్గొన్నారు.

ఏడు వాహనాలు 13న బహిరంగ వేలం

జిల్లా అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు

నవతెలంగాణ-హవేలి ఘనాపూర్ : ఏడు వాహనాలను ఈ నెల 13 తేదీన బహిరంగ వేలం పద్ధతిన అమ్మడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. పాత కలెక్టర్ కార్యాలయంలో ఉన్న ఏడు ఫోర్ వీలర్ వాహనాలను బహిరంగ వేలం వేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 13 నుంచి 50,000/-ధరావత్ సొమ్ము డిమాండ్‌ను కలెక్టర్ కార్యాలయం పేరిట డ్రాఫ్ట్ రూపంలో తీసుకొని, టెండర్ ఫారంనకు జతపరిచి కలెక్టర్ కార్యాలయంలో సమర్పించాలని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 7337340816 అనే నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వయనాడ్ వరద బీభత్సవాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలి

- వరద బాధితులను ఆదుకునేందుకు విరివిరిగా విరాళాలు ఇవ్వండి
- సీపీఐ(ఎం)రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు చుక్క రాములు
- జిల్లాలో సేకరించిన విరాళాలు రాష్ట్ర కమిటీకి అందజేత



నవతెలంగాణ-సంగారెడ్డి

కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో వర్షాల కారణంగా కొండ చర్యలు విరిగిపడి వందలాది మంది మరణించి, వేలాదిమంది నిరాశ్రయులు అయ్యారని.. కాబట్టి కేంద్రం వెంటనే దాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించి వాయనాడ్ ప్రజలను ఆదుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు డిమాండ్ చేశారు. వరద బాధితుల కోసం జిల్లా కేంద్రంలో సేకరించిన విరాళాలను చుక్క రాములు ద్వారా రాష్ట్ర కేంద్రానికి సోమవారం పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరద బీభత్సంతో వాయనాడ్ అతలాకుతలం అయ్యిందన్నారు. పర్యాటక కేంద్రంగా ప్రఖ్యాతి గాంచిన ఆ ప్రాంతం.. ఇప్పుడు ఇలాంటి స్థితిలో ఉండటం బాధాకరమన్నారు. ఈ సమయంలో కేరళకు అండగా నిలబడాల్సిన కేంద్ర ప్రభుత్వం బాధ్యతా రహితంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. ఈ వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించి వాయనాడ్ ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో వరద బాధితుల కోసం సేకరించిన విరాళాలు పార్టీ రాష్ట్ర కమిటీ ద్వారా వరద బాధితులకు పంపిస్తా మన్నారు. ఈ కార్యక్ర మంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజయ్య, మానిక్, సాయిలు, ఆఫీస్ కార్యదర్శి పి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విరాళాల సేకరణ..

నవతెలంగాణ-జహీరాబాద్, సదాశివపేట

నిరాశ్రయులైన ఆదుకునేందుకు జహీరాబాద్, సదాశివపేటలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సోమవారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా జహీరాబాద్‌లో సీపీఐ(ఎం) ఏరియా కమిటీ సభ్యులు ఎస్.మహిపాల్, సదాశివపేటలో ఏరియా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌లు వేర్వేరుగా మాట్లాడుతూ.. వరద బీభత్సంతో వాయనాడ్‌లో వేలాది మంది నిరాశ్రయుల య్యారన్నారు. ఈ సమయంలో అండగా నిలబడాల్సిన కేంద్ర ప్రభుత్వం బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నదన్నారు. పార్టీ ఆధ్వర్యంలో సేకరిస్తున్న విరాళాలను పార్టీ రాష్ట్ర కమిటీ ద్వారా వరద బాధితులకు పంపిస్తా రన్నారు. ఈ కార్యక్రమాల్లో జహీరాబాద్‌లో సీపీఐ(ఎం) నాయకులు సలీమొద్దీన్,బక్కన్న, నరేష్, సదాశివపేట



ఏరి యా కమిటీ సభ్యులు రమేష్ గౌడ్, ఏసబ్, పార్టీ నాయకులుమల్లేశం,



నర్సింలు,కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కోహిర్ తహసీల్దార్, ఆర్ఐని సస్పెండ్ చేయాలి

- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన మాచిరెడ్డిపల్లి గ్రామస్తులు

నవతెలంగాణ-జహీరాబాద్

మాచిరెడ్డిపల్లె రైతులకు కొత్త పాసు పుస్తకాలు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కోహిర్ తహసీల్దార్, ఆర్ఐలను తక్షణమే సస్పెండ్ చేయాలని కోరుతూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మాచిరెడ్డిపల్లి గ్రామ స్తులు జిల్లా కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. అంతకుముందు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.రామచంద్ర మాటాడుతూ.. మాచిరె డ్డిపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 81లో గల రైతులు తమకు కొత్త పాస్ పుస్తకాలు ఇవ్వాలని ధరణి వచ్చిన నాటి నుంచి తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్‌లకు పలు దఫాలుగా వినతి పత్రాలు అందించినా నేటికి సమస్య పరిష్కరించలే దన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం జరిగిన ఉద్యమం సందర్భంగా రెవెన్యూ, ఫారెస్టు అధికారులు జయింట్ సర్వే చేపట్టి.. సాగు చేస్తున్న రైతుల పేర్లు,



రెవెన్యూ రికార్డులను, వివరాలను నమోదు చేశారన్నారు. ఈ వివరాలు ఉన్నప్పటికీ.. జీఎల్ఎంలో దరఖాస్తులు పెట్టిన రైతుల అప్లికేషన్లను.. సదరు భూమిపైన రైతులు లేరని అబద్ధపు రిపోర్టులతో ఆర్డీఓ కార్యాలయానికి పంపించి రిజెక్ట్ చేయించారన్నారు. దాంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురయ్యారని.. భూమిని పరిశీలించకుండారికార్డులను పరిశీలించకుండా ఏకపక్షంగా కోహిర్ తహసీల్దార్ బాల శంకర్, ఆర్ఐలు దరఖాస్తులను రద్దు చేయడం అన్యాయ మన్నారు.

అంతకుముందు జరిగిన ధర్నాలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జి.జయరాజు పాల్గొని మాట్లాడుతూ.. ధరణి సమస్యలు పరిష్కారం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం, రెవెన్యూ యంత్రాంగం ప్రకటనలకే పరిమితం అయ్యాయ న్నారు. ప్రభుత్వం చెబుతున్న దానికి కిందిస్థాయిలో అధికార యంత్రాంగం వ్యవహరిస్తున్న తీరు భిన్నంగా ఉన్నద న్నారు. తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటేనే మిగతావారికి భయం ఉంటుందన్నారు. కాబట్టి కోహిర్ తహసీల్దార్, ఆర్ఐపై చర్యలు తీసుకోవాలని.. అంతవరకు తమ పోరాటం కొనసాగుతూనే ఉంటుంద న్నారు. రైతులకు సీపీఐ(ఎం) అండగా నిలబడుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో రవి, బిచ్చన్న, శంకర్, బి.శ్రీనివాస్, శీను, మమత, శాంతమ్మ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులు బోర్లు వేసుకుని మామిడి తోటలు, అనేక రకాల పంటలు సాగుచేస్తున్నా.. ఆ భూముల్లో అసలు పొజిషన్‌లోనే లేరనడం దుర్మార్గమన్నారు. రద్దు చేసిన దరఖాస్తులపై విచారణ జరిపించాలని కలెక్టర్‌ను కోరారు.

భూనిర్వాసితుల కోసం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి

సీఐటీయూ మండల నాయకులు వెంకటాచారి



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ పట్టణంలో ఉన్న మల్లన్న సాగర్ నిర్వాసితులకు ప్రభుత్వం వెంటనే ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని సీఐటీయూ గజ్వేల్ మండలం నాయకులు వెంకటాచారి కోరారు. మల్లన్న సాగర్ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టి దాదాపు ఆరేళ్లు పూర్తైన, భూ నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం ఇప్పటి వరకు అందలేదని పేర్కొన్నారు. ముంపు గ్రామాల ప్రజలకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, ఒంటరి మహిళలకు డబల్ బెడ్ రూమ్ ఇల్లు రిజిస్ట్రేషన్, 18 ఏళ్ల పైబడిన యువతకు ప్యాకేజీ, ప్లాట్ రిజిస్ట్రేషన్, కొన్ని అసైన్డ్ భూముల పరిహారాలు కూడా గత ప్రభుత్వం పూర్తిస్థాయిలో చెల్లించలేదని, దీని కొరకు దాదాపు ఆరేళ్ల నుంచి ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్నో దరఖాస్తులు ఇచ్చినప్పటికీ ఫలితం లేకుండా పోయిం దన్నారు. భూనిర్వాసితుల సమస్యలను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కనీసం మల్లన్న సాగర్ నిర్వాసితులకు కనీస వసతులు లేవని పేర్కొన్నారు. నిర్వాసితులు ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు జరిపేందుకు కూడా వైకుంఠధామాలు నిర్మించలేదన్నారు. అడవిలో ఆగం చేసినట్లుందని ఆవేదన చెందారు. ప్రభుత్వం ఎన్నికల ముందు పూర్తిస్థాయిలో ఆదుకుంటామని హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు హామీలు నెరవేర్చడం లేదన్నారు.

ప్రజాపాలన అంటే..దళిత మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడమా?

- విచారణ పేరుతో చిత్రహింసలకు గురిచేసిన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డిని డిస్మిస్ చేయాలి
- సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలి
- కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్

నవతెలంగాణ-సంగారెడ్డి

రాష్ట్రంలో ప్రజాపాలన సాగుతున్నదని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నదని.. ప్రజాపాలన అంటే దళిత మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడమేనా అని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్ ప్రశ్నించారు. బంగారం దొంగతనం చేసిందనే నెపంతో దళిత మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోంచి చిత్రహింసలు పెట్టిన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్, సంబంధిత సిబ్బం దిని వెంటనే డిస్మిస్ చేయాలని కోరారు. ఈ మేరకు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని న్యూ బస్టాండ్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాణిక్ మాట్లాడుతూ.. గత నెల 24న రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ అంబేద్కర్ కాలనీకి చెందిన దళిత



మహిళ సునీత.. ఆమె ఇంటి పక్కన గల నాగేందర్ ఇంట్లో బంగారం దొంగిలించిందనే నెపంతో రాత్రి 8 గంటలకు ఆమెను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారన్నారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, నలుగురు పోలీసులు విచారణ పేరుతో ఆమె చీర విప్పి నెక్కర్ తొడిగి మరీ.. థర్డ్ డిగ్రీ ప్రయోగించి చిత్రహింసలకు గురిచేశారన్నారు. ఈ ఘటనను కేవీపీఎస్ తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. దొంగతనం పేరు మీద బాధితురాలి భర్త భీమయ్యను మొదట్లో కొట్టి వదిలేసి.. ఆమె కుమారుడు తొమ్మిదో తరగతి చదువుతున్న మైనర్ అయిన ప్పటికీ అతడిని సైతం కర్రలతో కొట్టారన్నారు. ఒకే కుటుంబంలో భర్త, భార్య, కుమారుడు ముగ్గురిని చిత్రహింసలు పెట్టడం దుర్మార్గమన్నారు. నేరం ఒప్పుకోవాలంటూ కన్నతల్లి ముందే కుమారుడు జగదీష్‌ను చిత్రహింసలు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వంలో సైతం దళితులపై దాడులు ఆగవా అని ప్రశ్నించారు. దళిత మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన ఈ ఘటనపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలన్నారు. థర్డ్ డిగ్రీ ప్రయోగించిన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి మరో నలుగురు కానిస్టేబుళ్లను తక్షణమే డిస్మిస్ చేయాలని.. వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత దళిత మహిళకు కార్పొరేట్ వైద్యం అందించి ఆమె ప్రాణాల ను కాపాడాలని కోరారు. ఆ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియో అందించాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుం డా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి పి.అశోక్ జిల్లా సహాయ కార్యదర్శి దాసు, జిల్లా కమిటీ సభ్యులు దత్తు, చంద్రశేఖర్, నితిన్, నాయకులు శ్రీనివాస్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

జగ్గారెడ్డిని కలిసిన మాజీ సైనికులు

నవతెలంగాణ-సంగారెడ్డి



మాజీ సైనికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మాజీ సైనికుల కమిటీ మెంబర్ తోపాజి అనంత కిషన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాశ్ రెడ్డిని సచివాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. తూర్పు జయప్రకాష్ రెడ్డి సానుకూలంగా స్పందించి, మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు సాయన్న తదితరులు పాల్గొన్నారు.

హెూటల్ వద్ద వివాదం

- ఐదుగురికి తీవ్ర గాయాలు
- ఆస్పత్రిలో బాధితులను పరామర్శించిన కాట శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ-పటాన్‌చెరు

ఓ హెూటల్ వద్ద కస్టమర్లకు, నిర్వాహకులకు జరిగిన చిన్నపాటి వివాదం చిలికిచిలికి గాలివానై తలలు పగులగొట్టుకు నేంతవరకు వెళ్లింది. దాంతో 65 జాతీయ రహదారిపై తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనలో గాయపడిన ఒకరి పరిస్థితి విషమంగా ఉండగా, మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి.పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. సీఐ ప్రవీణ్ వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ శివారలో జాతీయ రహదారిపై ఉన్న పట్నం హైవే హెూటల్లో భోజనం చేసేందుకు లక్డారం గ్రామానికి చెందిన కొంత మంది వచ్చారు. హెూటల్లో చినిగిపోయిన ఇస్తరాకులు ఇచ్చారని, ఆహారం చల్లారిపో యిందని సర్వర్‌తో గొడవ పడ్డారు. కుర్చీలు సైతం విరగొట్టారు. దాంతో రుద్రారం గ్రామానికి చెందిన వంశీతో పాటు హెూటల్ నిర్వాహకులు దాదాపు 15 మందికిపైగా వచ్చి లక్డారం గ్రామస్తులపై కట్టెలతో, రాడులతో దాడి చేశారు. ఈ క్రమంలో జరిగిన దాడిలో లక్డారం గ్రామానికి చెందిన మాణిక్‌రెడ్డి తీవ్ర గాయాలపాలు కాగా ఆయన పరిస్థితి విషమంగా మారింది. గోవర్ధన్‌రెడ్డి, మల్లారెడ్డి, నరసింహ గౌడ్, రాజిరెడ్డి లకు తీవ్రంగా గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను బీరంగూడ పనేషియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటన స్థలాన్ని సీఐ ప్రవీణ్ రెడ్డి సిబ్బందితో కలిసి పరిశీలించి వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

బాధితులను పరామర్శించిన కాట శ్రీనివాస్ గౌడ్

పట్నం హైవే హెూటల్ వద్ద వివాదం జరుగుతున్న



విషయం తెలిసి అక్కడికి వెళ్లి ఆపడానికి ప్రయత్నించిన మాజీ సర్పంచ్ రాజిరెడ్డిని కూడా తీవ్రంగా గాయపడేలా రెస్టారెంట్ నిర్వాహకులు దాడి చేశారు. రాజిరెడ్డి, వారి సోదరులను బీరంగూడ వద్ద ఉన్న పనేషియామెరిడియన్ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ వారిని పరామ ర్శించారు. ఈ విషయంపై డీఎస్పీ రవీందర్ రెడ్డి సిఐ ప్రవీణ్ రెడ్డి లతో మాట్లాడారు. విచక్షణారహితంగా కొట్టిన రెస్టారెంట్ నిర్వాహకులపై వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

యూసుఫ్ పేట లో భారీ ర్యాలీ, మానవహారం



నవతెలంగాణ-పాపన్నపేట

స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని యూసుఫ్ పేట ఉన్నత పాఠశాలలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించి, గ్రామ చౌరస్తాలో మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి డీఎల్పీవో సురేష్ బాబు మాట్లాడుతూ ఐదు రోజులపాటు చేపట్టబోయే ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని, ప్రతి ఒక్కరు పరిశుభ్రత పాటిస్తూ, పచ్చదనానికి కృషి చేయాలన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాలతీ దేవి మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ శ్రీధర్,స్థానిక డాక్టర్ సుజాత్ అలీ,అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, ఆరోగ్య కార్యకర్తలు, పాఠశాల సిబ్బంది నర్సింలు,బెండల పద్మ,పీడీ రాజేందర్,రఫీ,వీరేశం, శంకర్, స్వరూప,సునంద తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛదనం.. పచ్చదనం'లో భాగస్వాములు కావాలి

- జిల్లా కలెక్టర్ మను చౌదరి

నవతెలంగాణ-మర్కుక్

ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేలా మొక్కల పెంపకం, పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'స్వచ్ఛదనం.. పచ్చదనం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. సోమవారం మండల పరిధిలోని పాములపర్తి గ్రామంలో జిల్లా యంత్రాంగం ప్రజాప్రతినిధులు ఉన్నత పాఠశాల విద్యార్థితో కలిసి ర్యాలీ నిర్వహించి స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు ప్రజాప్రతినిధులతో కలిసి స్థానిక పల్లె ప్రకృతి వనంను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ పచ్చదనం-పరిశుభ్రత అందరి బాధ్యత అని, స్వచ్ఛదనం-పచ్చదనం అనే కార్యక్రమం ద్వారా పరిశుభ్రత, పచ్చదనం వలన కలిగే లాభాలను ప్రజలకు తెలియచెప్పి ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలు పట్టణాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు, మొక్కలు నాటి సంరక్షించే కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిదన్నారు. చెత్తను ఏరివేయడానికి గ్రామపంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్స్‌తో పాటు ట్రాక్టర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇంటింటికి తిరిగి తడి పొడి చెత్తను సేకరించి సెగ్రిగేషన్ షెడ్లలో వేరుచేసి వర్మి కంపోస్టు తయారుచేసి రైతులకు అందించడం జరుగుతుందన్నారు. తద్వారా వ్యాధులు కూడా ప్రబలే అవకాశాన్ని నిరోధించగలుగుతామన్నారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. మిషన్ భగీరథ పైపుల ద్వారా శుద్ధమైన త్రాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు. వాటర్ ట్యాంకులను శుభ్రం చేసి, క్లోరినేషన్ చేస్తూ అధికారులు



నీరు కలుసితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటినే త్రాగాలన్నారు. ఈ స్వచ్ఛతనం పచ్చదనం కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దులుద్దీన్, ఏపీఎం బ్రహ్మచారి, పంచాయతీ కార్యదర్శి నరేందర్ పాఠశాల ఉపాధ్యాయులు మహిళా సంఘాల సభ్యులు విద్యార్థులు గ్రామస్తులు తదితరులున్నారు.

ఎస్ఐని కలసిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-మర్కుక్

మర్కుక్ నూతన ఎస్ఐ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఓ దామోదర్‌ను మండల బీఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు మ్యాకల కనకయ్య ముదిరాజ్, మర్కుక్ తమాజీ సర్పంచ్ భాస్కర్‌లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సుధాకర్ రెడ్డి, సంతోష్ రెడ్డి, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారిణి పద్మజ రాణి అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి 75 దరఖాస్తులు వచ్చాయని, అందులో రెవెన్యూకి సంబంధించినవి 21 ఉన్నాయన్నారు. వచ్చిన దరఖా స్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన వాటిని ఆయా శాఖల అధికారులు సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆచార్య డిగ్రీ కళాశాలలో ఘనంగా కామర్స్ దినోత్సవం

నవతెలంగాణ-జహీరాబాద్



జహీరాబాద్‌లోని ఆచార్య డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ కామర్స్ దినోత్సవాన్ని సోమవారం అట్టహాసంగా నిర్వహిం చారు. విద్యార్థులు అనేక రకాల ప్రాజెక్ట్‌సను ప్రదర్శించారు. అందులో ముఖ్యంగా ఫంక్షన్స్ ఆఫ్ కామర్స్, బ్యాలెన్స్ షీట్ ఫైనాన్స్ డిపార్ట్మెంట్ కి సంబంధించిన ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంల విద్యార్థులు ట్రేడింగ్ ఈ కామర్స్, జీఎస్టీ కన్స్యూమర్ రైట్స్ పైన స్కిట్ చేసి ఎంతగానో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. కామర్స్ అనేది నిత్యజీవితంలో ఎంతో అవసరమైనదని తెలియజేశారు. అదేవిధంగా కామర్స్ లెక్చరర్స్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎంప్లాయ్మెంట్ ట్రేడింగ్ ఫైనాన్స్ సర్వీసెస్ పైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రాంప్రసాద్ ,నందు గౌడ్, దత్తు, రమేష్, నవీన, నర్సింలు, నికిత, దీపిక, సల్మా ఉన్నిసా తదితరులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్ రోడ్డును నాలుగు లైన్ల రహదారిగా విస్తరించాలి

నవతెలంగాణ-పటాన్‌చెరు



పటాన్ చెరు నుండి ఇంద్రేశం మీదుగా దౌల్తాబాద్ వెళ్ళే అర్అండ్‌బి రోడ్డును నాలుగు లైన్ల రహదారిగా విస్తరణ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బి.నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఇంద్రేశం దర్గా వద్ద రాస్తరోకో చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఇంద్రేశం మీదుగా డౌల్తాబాద్ రోడ్డును విస్తరణ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయని, గుంతలు పూడ్చక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇంద్రేశం ప్రాంతం దాదాపు 40 కాలనీలు, అపార్ట్మెంట్లు ఇతర గృహ సముదాయాలతో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏరియా అని అన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు ప్రభుత్వం కల్పించడం లేదని విమర్శించారు. పెద్ద పెద్ద ట్రక్కులు,అతి భారీ వాహనాలు, బస్సులు, ఆటోలు, ఇతర వాహనాలతో అనునిత్యం రద్దీగా ఉంటుంది అని అన్నారు. రోడ్డు, గుంతలుగా ఉన్న రోడ్డుతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఎంతోమంది అనారోగ్యాలకు గురి అవుతున్నారన్నారు. ఉద్యోగస్తులు, కార్మికులూ, ఇతర ప్రజలు, విద్యార్థులు వేలాది మంది పటాన్‌చెరు మీదుగా హైద్రాబాద్ ప్రాంతాలకు వెళ్తుంటారన్నారు. ప్రజల సమస్యను దృష్టిలో ఉంచుకొని రోడ్డును విస్తరణ చేయాలని,గుంతలు గా ఉన్న రోడ్డును మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జయకుమార్,ఎస్.సురేష్ కుమార్, రాము, జి.సురేష్ కుమార్,నాగేంద్ర ప్రసాద్,వరప్రసాద్, ఎన్ నాగేశ్వరావు, యాదగిరి,అశోక్, చంద్రకిరాన్,అమ్రావు,శ్రీనివాస్ ఇతరులు పాల్గొన్నారు.

బషీర్ ఆధ్వర్యంలో కమిషనర్ కలిసిన కాలనీ వాసులు



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

ఐడిఎ బొల్లారం మున్సిపల్ 5వ వార్డు పరిధిలో తాగునీరు, రోడ్లు, డ్రైనేజ్ సమస్యలపై యువ నాయకుడు అబ్దుల్ బషీర్ ఆధ్వర్యంలో కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ మంగతాయారును సోమవారం కలిశారు. కమిషనర్ తక్షణమే స్పందించి.. ఏఈ కిష్టయ్యని పంపించి నేటి(మంగళవారం) ఉదయం 8 గంటలకి 5వ వార్డులో పర్యటించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ బాలయ్య, చిట్టి బాబు, దట్టి రాము, బక్క రాజు, రాం బాబు, మధు, సంతోష్, శీను, ప్రకాష్, నరేష్ అగర్వాల్, చిన్నఅంజయ్య, చింటూ, రాజు, ఉపేందర్,మధు, నిరంజన్, నరేష్, కత్తుల హరి తదితరులు పాల్గొన్నారు.

న్యాల్కల్ ప్రజావాణిలో 3 ఫిర్యాదులు

నవతెలంగాణ-న్యాల్‌కల్



న్యాల్‌కల్ తహసీల్దార్ కార్యాల యంలో సోమవారం జరిగిన ప్రజావా ణీలో 3 దరఖాస్తులు అందాయని తహసీల్దార్ భూపాల్ తెలిపారు. కాగా ఈ ప్రజావాణికి రెవెన్యూ ఈజీఎస్, విద్యుత్ హాజరుకాగా.. ఆర్అండ్‌బి, ఎంపీడీవో వివిధ శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. ఆర్అండ్‌బి రోడ్డు చాల్కి ఎక్స్ రోడ్డు నుంచి వయా చీకుర్తి సరిహద్దు వరకు పూర్తి గుంతలతో అధ్వానంగా మారిందని.. చీకుర్తి గ్రామంలో వాటర్ ట్యాంక్ లీకేజ్ మరమ్మత్తు కోసం.. వితంతు పింఛన్ మంజూరు చేయాలని చీకుర్తి గ్రామ నాయకుడు జనార్ధన్ రెడ్డి ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు.

వట్‌పల్లి ప్రజావాణిలో ఒకే దరఖాస్తు

నవతెలంగాణ-వట్‌పల్లి

మండల కేంద్రమైన తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి ఒకే ఒక దరఖాస్తు అందింది. మండల పరిధిలోని ఖాదిరాబాద్ గ్రామానికి చెందిన మహిళా రైతు తమ భూమి ధరణిలో కనిపించడం లేదని.. గతంలో రైతుబంధు వచ్చినప్పటికీ మళ్లీ రెండేళ్ల నుండి రైతుబంధు నిలిచిపోయిందని.. ఈ సమస్యను పరిష్కరించాలని ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నది.

సీసీ రోడ్డు రోడ్డు పనులు ప్రారంభం




నవతెలంగాణ-కొండాపూర్

మండలంలోని తొగర్‌పల్లి పంచాయతీలో సీసీరోడ్డు పనులను సంగారెడ్డి ఆత్మ కమిటీ చైర్మెన్ వై.ప్రభు, గ్రామ స్పెషల్ ఆఫీసర్ మర్రి ప్రదీప్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు సంయుక్తంగా మాట్లాడుతూ... గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం సీసీరోడ్డు మంజూరు చేసిందన్నారు. పనులు సకాలంలో నాణ్యతతో చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచిం చారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. ఈ ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రశాంత్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి నరసమ్మ, నాయకులు ప్రభాకర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజం

నవతెలంగాణ-రాయికోడ్



ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని తాజా మాజీ సర్పంచ్ శంకర్ అన్నారు. మండల పరిధిలోని హల్గెర గ్రామంలో కార్యదర్శి రజినీకాంత్ బదిలీపై వెళుతున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనకు పూలమాల శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. ప్రభుత్వ ఉద్యోగులు గ్రామంలో చేసిన అభివృద్ధిని అందరూ గుర్తుంచు కుంటారన్నారు. రజనీకాంత్ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేస్తూ ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పి. శంకర్, మౌలానా, యాకోబ్, ఆనంద్, దత్తు తదితరులు పాల్గొన్నారు.

బీ.ఆప్తోమెట్రీ కోర్సుకు ఉజ్వల భవిష్యత్తు

నవతెలంగాణ-పటాన్‌చెరు

ప్రముఖ నేత్ర వైద్య సంస్థ ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ సౌజన్యంతో, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లో నిర్వహిస్తున్న బీ.ఆప్తోమెట్రీ కోర్సుకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గీతం సైన్సస్ డీన్ ప్రొఫెసర్ కే.ఎస్. కృష్ణ అన్నారు. 2024-25 విద్యా సంవత్సరం బీ. ఆప్తోమెట్రీ బ్యాచ్ ను సోమవారం ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. పర్యావరణ వ్యవస్థ, అందులో వస్తున్న మార్పుల కారణంగా కంటిపై ప్రభావం పడి దృష్టి లోపానికి దారితీస్తోందన్నారు. మానవ శరీరంలోని ముఖ్యమైన భాగాలలో కన్ను ఒకటని, దానిపై లోతైన అవగాహన బీ.ఆప్తోమెట్రీ కోర్సు ద్వారా లభిస్తుందని ప్రొఫెసర్ కృష్ణ చెప్పారు. ఈ కోర్సును అభ్యసించే విద్యార్థులంతా భౌతిక శాస్త్రంలో, మరీ ముఖ్యంగా ఆప్టిక్స్ లో మంచి పట్టు సాధించాలని సూచించారు. కంటి సంరక్షణలో వినూ త్న ఆవిష్కరణలను చేయడానికి కాంతి లక్షణాలు-ప్రతిబింబం, వక్రీభవనం, విక్షేపం-వెనుక ఉన్న శాస్త్రంలో లోతుగా అవగాహన ఏర్పరుచుకోమంటూ విద్యార్థులను ఆయన ప్రోత్సహించారు.నుంచి ఆత్మవిశ్వాసంతో, ఉన్నతా శయంతో ఈ నాలుగేళ్లు కష్టపడమని బీ. ఆప్తోమెట్రీ విద్యార్థులకు ప్రొఫెసర్ కృష్ణ సలహా ఇచ్చారు.బీ.ఆప్తోమెట్రీ కోర్సు నూతన విద్యార్థులను ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్ సిట్యూట్ కు చెందిన ప్రొఫెసర్ శ్రీకాంత్ భరద్వాజ్ స్వాగతించారు. ఈ కోర్సులో క్లినికల్ టెక్నికల్ తో పాటు కఠినమైన విద్యా శిక్షణ ఉంటుందని, నైపుణ్య శిక్షణ ఎల్వీ ప్రసాద్, విద్యా సంబంధ జ్ఞానం గీతమ్ లో లభిస్తుం దన్నారు. ఈ ఏడాది ఆప్తోమెట్రీ వందవ వార్షికోత్సవం జరుపుకుంటున్నారని, గత శతాబ్ద కాలంలో ఈ వృత్తి చాలా బాగా అభివృద్ధి చెందినట్టు ఆయన చెప్పారు. కేవలం కళ్ల అద్దాలను సూచించడమే గాక, రోగుల సంరక్షణలో ఆప్తోమెట్రీ విద్యార్థులు ముందుండటమే గాక, అనేక రకాల పరిస్థితులను నిర్ధారించడం, వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయడంగా ప్రొఫెసర్ శ్రీకాంత్ అభివర్ణించారు.ఈ ఇండక్షన్ కార్యక్రమంలో ఎల్వీ ప్రసాద్ కు చెందిన డాక్టర్ విజయ్ కుమార్, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ఇన్చార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.రెజా, కార్యక్రమ సమన్వయకర్త -భౌతిక శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ టి.విశ్వం తదితరులు పాల్గొన్నారు. క్లినికల్ ప్రాక్టీస్, పరిశోధన, ప్రజారోగ్యం, కంటి సంరక్షణలో ఆవిష్కరణలతో సహా విభిన్న కెరీర్ మార్గాలను వక్తలు పునరుద్ఘాటించారు.

ప్రతిష్టాత్మకంగా 'స్వచ్ఛదనం-పచ్చదనం'

- ఇంటితోపాటు పరిసరాలూ పరిశుభ్రంగా ఉండాలి
- కలెక్టర్ క్రాంతి వల్లూరు
- సంగారెడ్డి 33వ వార్డులో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్
- జిల్లా వ్యాప్తంగా మొదటిరోజు కార్యక్రమాలు



నవతెలంగాణ-సంగారెడ్డి

గ్రామాలు పట్టణాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం పెంపొందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛదనం - పచ్చదనం' కార్యక్రమం ఐదు రోజులపాటు, జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లో నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. సోమవారం సంగారెడ్డి మున్సిపాల్టీ పరిధిలోని 33వ వార్డులో మున్సిపల్ చైర్మన్ బొంగుల విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ హాజరై మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు తమ ఇల్లు పరిశుభ్రంగా ఉంటే సరిపోతుందని ఇంట్లో చెత్త ఎక్కడ వేసినా ఏమీ కాదని భావించి చెత్తను మున్సిపల్ వాహనాల్లో కాకుండా ఆరుబయట వేస్తున్నారన్నారు. దాంతో దోమలు వ్యాపించి చికెన్ గున్యా, డెంగ్యూ, మలేరియా లాంటి అనేకరకాల సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. కాబట్టి మున్సిపల్, గ్రామ పంచాయతీ చెత్త సేకరణ వాహనాల్లో మాత్రమే చెత్తను వేయాలన్నారు. పట్టణంలో గుర్తించిన 64 చెత్త నిల్వ ఉన్న ప్రాంతాల నుంచి చెత్తను మొత్తం మున్సిపల్ సిబ్బంది తొలగించేలా పటిష్ట ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని 33వ వార్డులో మొక్కలు నాటడంతో పాటు స్వచ్ఛదనం పచ్చదనం అవగా హన ర్యాలీని నిర్వహించారు. ప్రతి శుక్రవారం నిర్వహించే ఫ్రైడే డ్రై డే కార్యక్రమంపై ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అద నపు కలెక్టర్ చంద్రశేఖర్ స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ఐదు రోజుల్లో నిర్వహించే వివిధ కార్యక్రమాలను వివ రించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మనోజ్, 33వ వా ర్డు కౌన్సెలర్ నాగరాజు, మున్సిపల్ కమిషనర్ సురేష్ పవర్, మున్సిపల్ డీఈ, ఇంతియాజ్, ఆర్పీలు, పట్టణ సమాఖ్య మహిళలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నరు.

సంగారెడ్డి మండల పరిధిలోని కులబ్‌గూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ ప్రత్యేక అధికారి, సంగారెడ్డి తహసీల్దారు జయలక్ష్మి హాజరై 5 రోజుల ప్రణాళికను గ్రామస్తుల సమక్షంలో వివరించారు. గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. రోడ్లు, మురికి కాలువలు, వీది లైట్లు, మంచి నీటి విడుదల, పారిశుద్ధ్యం తదితర అంశాలపై చర్చించి సమస్యలు తెలుసుకు న్నారు. అనంతరం ఆయా ప్రాంతాలను సందర్శించారు. గ్రామంలో కుక్కల బెడద ఉందని వీటి నిర్మూలనకు చర్యలు తీసుకో వాలని గ్రామస్తులు కోరారు. మొరం పోసి దెబ్బ తిన్న రోడ్లు బాగు చేయాలని కోరారు. సంగారెడ్డి పట్టణంలో సేకరించిన చెత్తను ఎలాంటి రక్షణ కవర్లో లేకుండానే ట్రాక్టర్లు, ఆటోల ద్వారా సదాశివనగర్ మీదుగా తరలిస్తున్నారని.. దాంతో ఇబ్బంది పడాల్సి వస్తుందని గ్రామ సభలో పలువురు తెలిపారు. సదాశివనగర్ వద్ద ప్రత్యేకంగా బస్సు రిక్వెస్ట్ స్టాప్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలోమాజీ సర్పంచ్ లక్ష్మారెడ్డి, మాజీ వార్డుసభ్యులు కృష్ణ, జావేద్, కోఆప్షన్ మెంబర్ ఇసాక్, కార్యదర్శి గణేష్, అంగన్వాడీ కార్యకర్తలు, వైద్యారోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

హత్నూర : మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద మొక్కలు నాటి స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పారిశుధ్య నిర్వహణ, గ్రీనరీ పెంపు లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ కార్యక మాన్ని ప్రజాప్రతినిధులు అధికారులు కట్టుదిట్టంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రత ప్లాస్టిక్ వాడకంలో దుష్ఫలితాల పైన సూచనలతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఫర్హీన్ షేక్, ఎంపీడీవో శంకర్, ప్రత్యేక అధికారి స్వప్న, ఏపీఎం రవీందర్, ఆర్ఐ శ్రీనివాస్, ఎంపీ ఓ యూసుఫ్, మాజీ ఎంపీపీ నర్సింలు, సీనియర్ నాయకులు పండుగ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌రూరల్ : నారాయణఖేడ్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రభుత్వ ఆసుపత్రి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొని మాట్లాడుతూ..చెట్లను నరికి వేయొద్దని మొక్కలు పెంచాలని పిలుపునిచ్చారు. చెట్లను నరకడం ద్వారా వాతావరణ మార్పులు సంభవించి జీవ మనుగడే ప్రమాదంలో పడుతున్నదన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ అశోక్ చక్రవర్తి, డీఎస్పీ వెంకట్ రెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్, మున్సిపల్ కమిషనర్ జాగ్ జీవన్, మున్సిపల్ చైర్మెన్ ఆనంద్ స్వరూప్‌శెట్కార్, ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు తాహెర్ తదితరులు పాల్గొన్నారు..

జోగిపేట : డాకూర్ గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమంలో ఆర్డీఓ పాండు, ఎంపీడీఓ రాజేష్ కుమార్, ఎంపీవో అశోక్, ఎంఈఓ కృష్ణ, అక్సన్ పల్లి పీఏసీఎస్ చైర్మెన్ నరేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ పూజా రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అందోల్ జోగిపేట మున్సిపల్‌లో..

అందోల్ జోగిపేట మున్సిపల్ లో స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా 10వ వార్డులో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమ అనంతరం 20 వార్డుల్లో కార్యక్రమాలు ఆయా కౌన్సిలర్ల ఆధ్వర్యంలో ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ పాండు, చైర్మెన్ గూడెం మల్లయ్య, కమిషనర్ తిరుపతి, వార్డు కౌన్సిలర్స్ ఎస్ సురేందర్ గౌడ్, ఆకుల చిట్టిబాబు, డాకురి శంకర్, పట్లోళ్ల రేఖా ప్రవీణ్, రంగా సురేష్, కోరబోయిన నాగరాజు, ఉలువల మాధవి వెంకటేశ్, చందర్ నాయక్, దుర్గేష్, హరికృష్ణ గౌడ్, మెప్మా సి.ఓ బిక్షపతి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సదాశివపేట : మండలంలోని పెద్దాపూర్, కోనాపూర్ గ్రామాల్లో జరిగిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు, విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే దుష్ప్ర భావాలు, పారిశుధ్యం, మొక్కల పెంపకం వంటి అంశాల గురించి అవగాహన కల్పించారు. ప్రతిరోజు కార్యక్రమాలన్నీ ఘనంగా నిర్వహించాలని సూచించారు. తదనంతరం ఆయా గ్రామాల్లోని జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఈ కార్యక్రమాల్లో తాజా మాజీ సర్పంచులు, తాజా మాజీ ఎంపీపీలు, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ కార్యదర్శిలు, గ్రామస్తులు, పాఠశాలల ప్రధానోపాధ్యా యు లు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమీన్‌పూర్ : మున్సిపల్ కార్యాలయం ఆవరణలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా వ్యర్థాల తొలగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని ప్రతీ కాలనీలో వివిధ కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ కె . నారాయణరావు, మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి, కౌన్సిలర్ కృష్ణ, కొల్లూరు చంద్రకళ గోపాల్, మంజుల ప్రమోద్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు తలారి రాములు, సీనియర్ నాయకులు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ : మున్సిపల్ ఆఫీస్ నుంచి ఐబి వరకు స్వచ్ఛదనం-పచ్చదనం ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఛైర్పర్సన్స్ తంజిమ్, మాజీ కౌన్సిలర్స్ రాములు నేత, యూనోస్ తదితరులు పాల్గొన్నారు.

ఐడీఏబొల్లారం : మున్సిపాల్టీ పరిధిలోని జ్యోతినగర్‌లో మున్సిపల్ వార్డు అధికారులు, ఆశా వర్కర్లు, స్థానికులతో కలిసి స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ యువజన నాయకుడు వి.ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ.. కార్యక్ర మంలో మొదటి రోజు బహిరంగ ప్రదేశాల్లో, ఖాళీ ప్రదేశాల్లో ఎవరు కూడా చెత్త వేయవద్దని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే సిజినల్ వ్యాధులు రాకుండా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్చార్జి దుర్గాప్రసాద్, మాజీ ఎంపీటీసీ కృష్ణంరాజు, స్థానికులు శేఖర్, దీప్తి, కాంచన, లక్ష్మి, అర్చన, సురేఖ, దత్తు, సింహాచలం, సాయి, జైరాం, ప్రసాద్, మున్నా, శంకర్, వైద్య ఆరోగ్య సిబ్బంది, కాలనీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మడిదల : గుమ్మడిదల, బొంతపల్లి, దోమడుగు, అన్నారం, వీరన్న గూడెం, మంబాపూర్, నల్లవల్లి, కొత్తపల్లి, నాగిరెడ్డి గూడెం, అనంతారం, కానుకుంట, రామ్ రెడ్డి బాయ్, వీరారెడ్డిపల్లి గ్రామాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రత్యేక అధికారి జ్యోతి, మండల ఎంపీడీవో ఉమా దేవి మాట్లాడుతూ.. నర్సరీ కేంద్రాల్లో సమాజానికి ఉపయోగపడే మరియు వన్యప్రాణుల కోసం పండ్లు మొక్కలు నాటడంతో కోతులను కనీసం గ్రామాల్లోకి రాకుండానైనా అరికట్టవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, మహిళలు, అంగన్వాడీ టీచర్స్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

న్యాల్‌కల్ : మండలంలోని ముర్తుజాపూర్ గ్రామపంచాయతీలో స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ దయానంద్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఫహీమ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అలాగే మండలంలోని మెటల్‌కుంట, గంగ్వార్, మామిడిగి, చాల్కి , ఖలీల్పూర్, టెకుర్ గ్రామాల్లో పచ్చదనం -స్వచ్ఛదనం కార్యక్రమాన్ని నిర్వఇంచారు. ఆయా గ్రామాల్లో గ్రామ స్పెషల్ ఆఫీసర్లు.. సెక్రెటరీలు, ప్రజలతో అవగాహన సమావేశం నిర్వహించారు.కార్యక్రమాల్లో తహసీల్దార్ భూపాల్, స్పెషల్ ఆఫీసర్లు రాజిరెడ్డి, నాయకులు తిరుపతిరెడ్డి, రేజింతల్ శ్రీనివాస్ రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, సంజీవరెడ్డి, సెక్రెటరీలు అశోక్, శివశంకర్, వివేక్,గౌసొద్దీన్ పాల్గొన్నారు.

మనూర్ : నాగలిగిద్ద, మనూర్ మండలాల పరిధిలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రత్యేక ర్యాలీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

























హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలి

- హాస్టల్ నిర్వాహణకు ప్రత్యేక నిధిని కేటాయించాలి
- కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పి.అశోక్

నవతెలంగాణ-సంగారెడ్డి



హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జెస్ పెంచాలని,హాస్టల్లో నిర్వాహనకు ప్రత్యేక నిధిని కేటాంయించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పి.అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లాలోని హాస్టల్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో ధర్నా నిర్వహించి అనంతరం డీఆర్‌టీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. సంక్షేమ హాస్టల్ల నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని పాత బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ప్రైవేట్ భవనాలలో కొనసాగుతున్న హాస్టళ్లకు నూతన భవనాలు అన్ని హంగులతో నిర్మించాలన్నారు. జిల్లా కేంద్రం బాబానగర్‌లో ఉన్న ఎస్సీ కళాశాల హాస్టల్ బిల్డింగ్ పురాతనమైన్దని.. వర్షం పడిన ప్రతీసారి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే నూతన భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. ఆర్‌ఓ ప్లాంట్స్, గ్రీజర్‌లు పనిచేయటం లేదని రిపేర్ చేయించాలన్నారు. కొన్ని పాఠశాలల్లో నోట్ పుస్తకాలు, బట్టలు, పెట్టెలు ఇతర మెటీరియల్స్ రాలేదని.. వెంటనే ఇవ్వాలని కోరారు. ప్యాకెట్ మనీ వేయి రూపాయలకు పెంచాలన్నారు. రెగ్యులర్ ఉద్యోగులను నియమించాలన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న వారికి బకాయి డబ్బులు వెంటనే చెల్లించాలన్నారు. పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరియల్‌ను హాస్టల్ విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మద్దూరి శివకుమార్, టి.మల్లేశం, సహాయ కార్యదర్శి దాసు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్,కేవీపీఎస్ జిల్లా నాయకులు శ్రీనివాస్, మహేష్,రాజు, పవన్ కృష్ణ మొగులయ్య మునిష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించండి


నవతెలంగాణ-సంగారెడ్డి



తెలంగాణ నాల్గోవ తరగతి ఉద్యోగుల సంఘం సమావేశం జిల్లా సంఘ భవన్లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వై.నర్సింలు, ప్రధాన కార్యదర్శి రాహుల్ మాట్లాడుతూ.. సీపీఎస్ విధానాన్ని తొలగించి ఓపీఎస్ పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపె ట్టాలని కోరారు. సీపీఎస్ విధానంతో ఉద్యోగులకు తీవ్రమైన నష్టం జరుగుతుందన్నారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన డీఏలను ప్రభుత్వం వెంటనే ప్రకటింపచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సంపత్, లియకత్ అలీ, రుతు, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీ సెల్ చైర్మన్‌గా అనిల్ కుమార్

నవతెలంగాణ-కోహిర్



మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన అనిల్ కుమార్‌ను మండల ఎస్సీ సెల్ చైర్మెన్‌గా సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ చైర్మెన్ హనుమంత్ యాదగిరి నియమించారు. ఈ మేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామలింగారెడ్డి నియామక పత్రాన్ని అనిల్‌కుమార్‌కు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ.. మండల ఎస్సీ సెల్ చైర్మెన్‌గా నియమించిన ందుకు కాంగ్రెస్ పార్టీకి ఎంతో రుణపడి ఉంటానన్నారు. ఎల్లవేళలా ప్రజా సేవ చేస్తానన్నారు. తనను నియమి ంచిన కాంగ్రెస్ పార్టీకి, సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మెన్‌కు, ఎంపీ సురేష్ షెట్కార్‌కు, జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చంద్రశేఖర్‌కు రామ లింగ రెడ్డికి, మాజీ జెడ్పీటీసీ రాందా స్‌కు, జహీరాబాద్ ఎస్సీ సెల్ ఇన్చార్జికి, కోహిర్ మండల్ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం



- 226 ప్రజావాణి దరఖాస్తుల స్వీకరణ
- జిల్లా అదుపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-హవేలీ ఘనాపూర్

ప్రజా సమస్యల పరిష్కారానికి నేరుగా ప్రజావాణి కార్యక్రమాని, ప్రజలు నేరుగా వచ్చి సమస్యలు తమ దృష్టికి తేవాలని జిల్లా అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు జిల్లా ప్రజలకు సూచించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించడానికి ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి నేరుగా కలెక్టర్ కార్యాలయానికి వచ్చి తమ దృష్టికి తేవాలని సూచించారు. ఇతరుల మీద ఆధారపడరాదని సూచించారు. వివిధ ప్రజలు పెట్టుకున్న అర్జీలను వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కొరకు-30, ధరణి భూ సమస్యలు-50, పింఛన్లు కొరకు-45, రుణమాఫీ-40, ఉపాధి కోసం 05, ఇతర సమస్యలు-56 ప్రజలు ప్రజావాణిలో దరఖాస్తుల సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపీడీవో

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్



మండల పరిధిలోని కమలాపూర్ టెంకటి గ్రామాలలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను సోమవారం పెద్ద శంకరంపేట ఎంపీడీవో రఫీక్ ఉన్నిసా పరిశీలించారు. కమలాపూర్‌లో ఫారం పాడ్ పనులను, టింకటిలో పండ్ల తోటల పనులను ఆమె పరిశీలించారు. ఉపాధి హామీ పథకంలో ఉన్న పనుల గురించి రైతులకు అవగాహన కల్పించారు. రైతులు ఉపాధి హామీ పథకంలో ఉన్న పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ నవాజుద్దీన్, టిఏలు రమేష్, స్వప్న, సుభాష్ మోహన్, ఆయా గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు ఉత్తమ సేవలందించాలి

జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-హవేలి ఘనాపూర్




ఎస్బీఐ ఖాతాదారులకు ఉత్తమ సేవలు అందించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నూతన ఎస్బీఐ బ్యాంక్ బ్రాంచ్‌ను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో నూతనంగా 19వ ఎస్బీఐ నూతన బ్రాంచ్‌ను కలెక్టరేట్‌లో ప్రారంభించామని, ఖాతాదారులకు, కలెక్టరేట్ కార్యాలయ పనులకు ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. జిల్లాలో ఇతర బ్యాంకుల వలె కలెక్టర్ కార్యాలయ ఎస్బీఐ బ్యాంకులో కూడా అన్ని రకాల సేవలు అందుబాటులో ఉన్నాయని సాధారణ బ్యాంక్ రుణాలు, బంగారం పై రుణాలు, వ్యక్తిగత రుణాలు లాంటి అన్ని సౌకర్యాలు ఈ బ్రాంచ్‌లో కలిగి ఉంటాయన్నారు. ఖాతాదారులు, కలెక్టర్ కార్యాలయ అధికారులు, సిబ్బంది నూతన ఎస్బీఐ బ్యాంకు సేవలు వినియోగించుకోవాలని తెలిపారు. త్వరలో ఏటీఎం సేవలు కూడా అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్బీఐ రీజినల్ మేనేజర్ అరుణ జ్యోతి, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ నరసింహమూర్తి, బ్యాంక్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలి

డీఎస్పీ వెంకట్ రెడ్డి

నవతెలంగాణ-నర్సాపూర్



విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని డీఎస్పీ వెంకట్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డ్రగ్స్ రహిత తెలంగాణలో భాగంగా మెదక్ ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం నర్సాపూర్ పట్టణ సమీపంలోని బీవీఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన డ్రగ్స్, సైబర్ క్రైమ్స్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయగా అతిథిగా డీఎస్పీ వెంకట్ రెడ్డి, హాజరై మాట్లాడారు విద్యార్థులు విద్యార్థి దశలో డ్రగ్స్‌కు అలవాటు పడితే వారి జీవితాలు పూర్తిగా నాశనం అవుతాయని, డ్రగ్స్ తీసుకోవడం వల్ల విద్యార్థులు పూర్తిగా చెడు వ్యసనాల భారీనపడి బంగారు భవిష్యత్తును విద్యార్థులు నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు సూచించారు. సైబర్ నేరగాల ట్రాప్‌లో పడకుండా విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. అనంతరం వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ యాంటినరోకొటిక్స్ పుష్పన్ కుమార్, రాములు నాయక్, ఇన్స్పెక్టర్ జాన్ రెడ్డి, ఎస్సైబీ లింగం, కళాశాల మేనేజ్మెంట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారించిన చైర్మన్

పీఏసీఎస్ చైర్మన్ వెంకట్ రామ్ రెడ్డి

నవతెలంగాణ-నర్సాపూర్



శివంపేట మండల పరిధిలోని పోతుల బోగూడ గ్రామంలో నీటి సమస్య ఉందని గ్రామ ప్రజలు పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామి రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో నీటి సమస్య పరిష్కారానికి కృషిచేశాన్ని పీఏసీఎస్ చైర్మన్ వెంకట్ రామ్ రెడ్డి గ్రామ ప్రజలకు హామీ ఇచ్చాడు. ఇచ్చిన హామీ ప్రకారం సోమవారం గ్రామంలో సొంత డబ్బులతో రెండు బోర్లు వేయించి గ్రామ ప్రజల నీటి సమస్యను తీర్చాడు. గ్రామ ప్రజల నీటి సమస్యను తీర్చినందుకు పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకటరామిరెడ్డికి గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, ప్రజలు శరభయ్య పటేల్, ప్రవీణ్, నాగేష్, దశరథ, దుర్గయ్య, బిక్షపతి, అశోక్, బాల్రాజ్, సంజీవ, నవీన్, మహేష్, వేణు తదితరులు ఉన్నారు.

కరాటే పోటీలలో నార్సింగి విద్యార్థుల పథకాల పంట

నవతెలంగాణ-నార్సింగి



సుబ్బు షోటోకాన్ కరాటే అకాడమి ఆధ్వర్యంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే కీ.శే సాయన్న జ్ఞాపకార్థం హైదరాబాద్‌లో తొలి జాతీయ స్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. జాతీయ స్థాయి పోటీలలో నార్సింగి విద్యార్థులు పథకాల పంట పండించారు. మూడు వేల పై చిలుకు మంది పాల్గొన్న, ఈ కార్యక్రమంలో నార్సింగి నుంచి పది మంది విద్యార్థులు వారి వయసు, బరువు ఆధారిత విభాగాలలో పాల్గొన్నారు. పోటీలలో పాల్గొన్న అందరూ పది మంది తమ ప్రతిభను కనబరుస్తూ బంగారు పథకాలు సాధించారు. విద్యార్థులకు సరైన శిక్షణ ఇచ్చి, పథకాలు సాధించడం కోసం సమాయత్తం చేసి, పథకాలు సాధించడానికి కారణమైన కరాటే మాస్టర్, బ్లాక్ బెల్ట్ సంపత్ కుమార్, పథకాలు సాధించి విద్యార్థులను ఈ సందర్భంగా గ్రాండ్ మాస్టర్ రొయ్యల ప్రసాద్, నార్సింగి మండల అధికారులు, పాఠశాలల అధ్యాపక బృందం, ప్రజలు అభినందించారు. వీరి గెలుపు అందరికీ ఆదర్శం, గర్వ కారణమని, భవిష్యత్తులో ఇంకా పోటీలలో గెలుపొంది, మాస్టర్ సంపత్ కుమార్‌కు, మండలానికి మంచి పేరు తేవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

నస్కల్ సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-నిజాంపేట

నిజాంపేట సబ్‌స్టేషన్ నస్కల్ సబ్ స్టేషన్లలో కొత్త ట్రాన్స్ఫార్మర్లను బిగించడం జరుగుతుందని నిజాంపేట కరెంటు ఏఈ గణేష్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంటు సప్లై నిలిపివేస్తున్నట్లు తెలిపారు. నిజాంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు, నస్కల్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు కరెంటు నిలిపివేయడం జరుగుతుందన్నారు. ఈ రెండు సబ్ స్టేషన్ల పరిధిలోని వినియోగదారులు విద్యుత్తు అధికారులకు సహకరించాలని కోరారు.

యూసుఫ్ పేటలో భారీ ర్యాలీ మానవహారం

నవతెలంగాణ-పాపన్నపేట

మండల పరిధిలోని యూసుఫ్‌పేట ఉన్నత పాఠశాలలో సోమవారం స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించి, గ్రామ చౌరస్తాలో మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి డీఎల్పీవో సురేష్ బాబు మాట్లాడుతూ ఐదు రోజుల పాటు చేపట్టబోయే ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని, ప్రతి ఒక్కరు పరిశుభ్రత పాటిస్తూ, పచ్చదనానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాలతీ దేవి మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ శ్రీధర్, స్థానిక డాక్టర్ సుజాత్ అలీ, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, ఆరోగ్య కార్యకర్తలు, పాఠశాల సిబ్బంది నర్సింలు, బెండల పద్మ, పీడీ రాజేందర్, రఫీ, వీరేశం, శంకర్, స్వరూప, సునంద తదితరులు పాల్గొన్నారు

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని చౌకత్ పల్లి తండాలో అనారోగ్యంతో మృతి చెందిన మాలోత్ హేమ్లి కుటుంబానికి ప్రముఖ సంఘ సేవకులు డాక్టర్ మోహన్ నాయక్ ఆర్థిక సహాయంగా రూ.5000వేలు అంద జేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మృతురాలు కుటుంబం కడు పేదరికంతో ఉన్నందున వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తండా నాయకులు రాజు, మేష్యు నాయక్, పత్తి నాయక్, రామావత్ రాజు, మంగ్యా, కస్య, శ్రీనివాస్, భాస్కర్, అరుణ్, పాల్గొన్నారు.

ఇల్లు చక్కబెట్టనోళ్లు గ్రామాన్ని ఏం చక్కబెడతారు

- అపరిశుభ్రంగా గ్రామాలు
- నీటి నిలువతో దోమలకు ఆవాసం
- టేక్మాల్ పంచాయతీ అధికారిపై మండిపాటు
- ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- స్వచ్ఛనం పచ్చదనం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-టేక్మాల్

ఇల్లు చక్కబెట్టనోళ్ల గ్రామాన్ని ఏం చక్కబెడుతారని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులపై మండిపడ్డారు. సోమవారం మండల కేంద్రమైన టేక్మాల్, బొడ్మాట్ పల్లి గ్రామాల్లో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామాల్లో ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం పురవీధుల గుండా తిరిగారు. టేక్మాల్ బస్టాండ్ ఆవరణంలో గుంతలు కావడంతో వాటిలో మట్టి పోయించలేదని పంచాయతీ కార్యదర్శిపై మండిపడ్డారు. గ్రామ పంచాయతీ ఆవరణంలో ఉన్న వాటర్ ట్యాంక్, ఇతర సామాగ్రిలో నీరు నిలువ ఉండడంతో దోమలు ఆవాసం చేస్తున్నాయని కలెక్టర్ వాటిని శుభ్రం చేసి పంచాయతీ కార్యదర్శిపై మండి పడ్డారు. గ్రామంలో పురవీధుల గుండా తిరుగుతూ గ్రామంలోని గుంతలను కలెక్టర్ పుడ్చారు. జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణంలోని మరుగుదొడ్లను పరిశీలించి వాటి మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేశారు. పాఠశాలలోని మధ్యాహ్నం భోజనం పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం బొడ్మాట్ పల్లి గ్రామంలోని హెల్త్ క్యాంప్‌ను పరిశీలించి రోగుల అవస్థలు తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. పాఠశాలలో మొక్కలు నాటారు. గ్రామంలోని పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. గ్రామాల్లో మరుగు కాలువలు శుభ్రంగా ఉంచేవిధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం ఐదు రోజుల పాటు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాద్దయ్య తహసీల్దార్ కృష్ణ, ఎంపిడిఓ రియాజోద్దీన్, ఏపీఓ పౌలు, ఏపీయం రామకృష్ణ, నాయకులు రమేష్, పాపయ్య, భాస్కర్ తదితరులు ఉన్నారు.



స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి















నవతెలంగాణ-వెల్దుర్తి

ఆగస్టు 5 నుంచి 9వ తేది వరకు ఉమ్మడి మాసాయిపేట్ వెల్దుర్తి మండలాల్లోని ప్రతి గ్రామపంచాయతీ పరిసరాల్లో స్వచ్ఛదనం పచ్చదనం వంటి కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఉమ్మడి మండలాల్లో గ్రామ పంచాయతీ కార్యదర్శి అంగన్వాడి అంగన్వాడి టీచర్లు ఈజీఎస్ సిబ్బంది, వైద్య సిబ్బంది, సమిష్టిగా కలిసి గ్రామాల్లో కలియ తిరుగుతూ స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇండ్ల మధ్యల పేరుకుపోయిన చెత్తకుప్పలు, నీటి నిలువలు, గుంతలను పూడ్చడం వర్షపు నీటిని ఆదా చేయడం, వీధుల్లో తిరుగుతూ పరిశుభ్రతపై అవగాహన కల్పించడం డ్రైనేజీలు పేరుకపోకుండా చూడడం, కుండీలలో నీరు నిలవకుండా చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని పంచాయతీ సెక్రెటరీ బలరాం రెడ్డి తెలిపారు. తడి పొడి చెత్తను వేరుచేసి చెత్త బండిలో వేయాలని సూచించారు. ఇంటి ముందర చెత్త పడేయకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఎవరి వీధిలో వారు శుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శిరీష, అంగన్వాడి టీచర్లు, ఏఎన్ఎం, ఈజీఎస్ సిబ్బంది ఆశా వర్కర్లు గ్రామపంచాయతీ వర్కర్లు పాల్గొన్నారు.

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్

ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని పెద్దశంకరంపేట తహశీల్దార్ గ్రేసీ బాయ్ అన్నారు. సోమవారం స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పెద్ద శంకరంపేటలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల పరిధిలోని బద్దారం బూర్గుపల్లి తదితర గ్రామాల్లో సైతం స్వచ్ఛతనం పచ్చదనం కార్యక్రమాలు నిర్వహించారు. పేట పి హెచ్‌సిలో సచ్ఛదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రఫిక్ ఉన్నిసా, ఈవో వెంకట రాములు, సిబ్బంది యాదయ్య ఆనంద్, అంగన్వాడీ టీచర్లు, సరళ సుజాత, సుక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నర్సాపూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ దుర్గప్ప గారి అశోక్ గౌడ్ అన్నారు. సోమవారం స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో నర్సాపూర్ పట్టణంలో విద్యార్థుల తో కలిసి ప్రజా ప్రతినిధులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను, పరిశుభ్రంగా ఉంచుకోవాలని పరిశుభ్రంగా ఉండటం వల్ల ఎలాంటి వ్యాధులు దరి చేరవని ఆయన గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ ఇంటి ముందు మొక్కలు నాటి చెట్లను పెంచడం వల్ల పచ్చదనం పెరిగి కాలుష్యం నివారించ బడుతుందని తెలిపారు. అంతే కాకుండా ప్లాస్టిక్‌ను తగ్గించి గన్ని సంచులు, బట్ట బ్యాగులు, వాడాలని సూచించారు. తడి, పొడి, చెత్తను వేరుగా చేసి సేంద్రియ ఎరువులు తయారు చేసుకోవచ్చని పేర్కొంటూ ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్ల పైన గాని బహిరంగ ప్రదేశాల్లో గాని చెత్తను పార వేయకుండా చెత్తను తీసుకెళ్లే స్వచ్ఛ ఆటోలో మాత్రమే వేసి పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పురపాలక కమిషనర్ జైతు రామ్ నాయక్, డిప్యూటీ డీఎంహెచ్ఓ సృజన, కౌన్సిలర్లు, వైద్య శాఖ, ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, మెప్మా విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నర్సాపూర్

విద్యార్థులు తమ ఇంటి పరిసరాల తోపాటు పాఠశాల ఆవరణలో మొక్కలు పెంచి పచ్చదనం పెరిగేందుకు శ్రద్ధ తీసుకోవాలని ఉపాధి హామీ ఏపీఓ అంజిరెడ్డి అన్నారు. సోమవారం నర్సాపూర్ మండల పరిధిలోని కాగజ్ మద్దూర్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లు నాటడంతో భవిష్యత్ తరాలకు మేలు చేస్తుంద న్నారు. అనంతరం ఉపాధ్యాయుడు డాక్టర్ సూర్య ప్రకాష్ రావు మాట్లాడుతూ పర్యావరణానికి మేలు చేకూర్చే విధంగా ప్రత్యామ్నాయ ఇంధన వనరులను వినియోగించేలా చూడాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ శివకుమార్, పంచాయతీ కార్యదర్శి శైలజ, అంగన్‌వాడీ కార్యకర్త మంజుల, ఉపాధ్యాయులు యూసుఫ్ షరీఫ్, మహేందర్ రెడ్డి, కవిత, బస్వరాజ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నిజాంపేట

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ఆదేశాల మేరకు మండల పరిధిలోని అన్ని గ్రామాలలో స్వచ్ఛ ధనం పచ్చదనము కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి గ్రామంలో విద్యార్థుల చేత గ్రామ మహిళల చేత ర్యాలీలు తీశారు. చల్మెడ గ్రామ ఇన్చార్జి అధికారి ఎంపీడీవో రాజిరెడ్డి, నిజాంపేట గ్రామ కార్యదర్శి నర్సింలు ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరు తమ తమ గల్లీలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇంటి చుట్టూ పరిసరాలను శుభ్రంగా చేసుకోవాలన్నారు. పరిసరాలు పచ్చగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని మొక్కలతో స్వచ్ఛమైన గాలి లభిస్తుందన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని దోమతెరలను వాడాలన్నారు. ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట గ్రామ కార్యదర్శి నర్సింలు, కారోబార్ కొండల్ రెడ్డి, అంగన్వాడీ టీచర్లు అరుణ, దుర్గేశ్వరి, మణెమ్మ, రేణుక, సుగుణ, ఆశా వర్కర్లు, బండారి లక్ష్మి, అనిత, బాలమణి, వివోలు పద్మ, లక్ష్మి సౌందర్య, చల్మెడ గ్రామ కార్యదర్శి నరసింహా రెడ్డి, ఏపీవో శ్రీనివాస్, తాజా మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ బాల్రెడ్డి, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నార్సింగి

స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని నార్సింగి, మిర్జాపల్లి రహదారి పై ఎంపీడీవో చిన్నారెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. వల్లూరు గ్రామంలో గ్రామ ప్రత్యేక అధికారి, తహసీల్దార్ షేక్ కరీం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తూప్రాన్ డివిజనల్ పంచాయితీ అధికారి యాదయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండల కేంద్రం, వల్లూరులో చెట్లు నాటడానికి ముందు వీధుల్లో విద్యార్థులు, అధికారులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, పంచాయతీ సిబ్బంది ర్యాలీ నిర్వహించి, మొక్కల వల్ల కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో చిన్నారెడ్డి, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జంగర్ల గోవర్ధన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని ఆగస్టు 5 నుంచి 9 వరకు ఐదు రోజులు కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిన్నారెడ్డి, తహసీల్దార్ షేక్ కరీం, మండల వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వై. రవికుమార్, ఏపీవో రాజేశ్వర్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి నాగభూషణం, అంజి రెడ్డి, ఐకెపి ఎపిఓ అశోక్, సిసి శంకర్ యాదవ్, సుల్తానా, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రావణ్ కుమార్ (బాబీ) కాంగ్రెస్‌ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జంగర్ల గోవర్ధన్, సీనియర్ నాయకులు అంచనూరి రాజేష్, మాజీ ఎంపిటిసి సత్య నారాయణ, అంగన్వాడి సిబ్బంది, ఆశా వర్కర్లు, గ్రామ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యురాళ్ళు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు, ప్రజలు పాల్గొన్నారు.

నవతెలంగాణ-పాపన్నపేట

స్వచ్ఛ ధనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన పాపన్నపేట ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశుభ్రం చేసి, మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మహేశ్వర్, స్థానిక తాజా మాజీ సర్పంచ్ గురుమూర్తి గౌడ్ ,ఎంపీటీసీ సభ్యులు ఆకుల శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు గౌస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శెట్టి శ్రీకాంత్ అప్ప, పంచాయతీ కార్యదర్శి నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలో తల్లి పాల వారోత్సవాలు







నవతెలంగాణ-చేగుంట

ఉమ్మడి చేగుంట మండలం కసాన్ పల్లి అంగన్వాడీ పాఠశాలలో సోమవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అంగన్వాడీ టీచర్ యం.శోభారాణి తల్లిపాల ప్రాధాన్యతను వివరించారు. పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలని, ఎడవ నెల నుంచి అనుబంధ పౌష్టికాహారం పెడుతూ, రెండు సంవత్సరాల వరకు అందించాలన్నారు. పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రు పాలు తాగించాలన్నారు. తల్లి పాలలో అన్నీ రకాల పోషకాలు అధికంగా ఉంటాయన్నారు. బిడ్డకు రోగ నిరోధక శక్తిని పెంచుతుందన్నారు. అదే విధంగా తల్లిపాలు సులువుగా బిడ్డకు జీర్ణం అవుతాయని పలు రకాల వ్యాదులు తల్లిపాలు ఇవ్వడంతో రావన్నారు. గర్భిణీ స్త్రీలు ఎప్పటికప్పుడు ఆరోగ్య చికిత్సలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నాగరాజు, ఆశా వర్కర్ భాగ్యలక్ష్మి, గర్భతులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-పాపన్నపేట

మండల పరిధిలోని మల్లంపేట గ్రామ అంగన్వాడి కేంద్రాలలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. పిల్లల తల్లులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు, పసిపిల్లలకు తల్లిపాలు ఇవ్వడం ప్రాముఖ్యత తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు కరణం కవిత, మంజుల, ఇందిరతో పాటు పంచాయతీ సెక్రెటరీ రిషికాంత్, ఏయన్ యం సంగీత, లక్ష్మి, సాయవ్వ, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-వెల్దుర్తి

ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సోమవారం మండల పరిధి చేరిలా గ్రామం అంగన్వాడి కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ వరలక్ష్మి ఆదేశాల మేరకు అంగన్వాడి టీచర్ దేవలత లక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు సామూహిక సీమంతాలు అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఏఎన్ఎం అనితతో కలిసి గర్భిణీ బాలింతలకు తల్లిపాల విశిష్టత గురించి వివరించారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రు పాలు తాగించాలన్నారు. శిశు ఆరోగ్యంగా ఎదగడానికి తల్లిపాలలో రోగనిరోధక శక్తి ఉంటుందన్నారు. తల్లిపాలు సులువుగా జీర్ణం అవుతాయన్నారు. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవనంతరం బిడ్డకు రెండు సంవత్సరాలు వచ్చే వరకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆశ మంజుల, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తున్నందుకు హర్షం

- రాష్ట్ర కార్యదర్శి బైండ్ల నందు





నవతెలంగాణ-నిజాంపేట

ప్రభుత్వ భూములకు అసైన్డ్ భూములకు పోడు భూములలో వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు రెండు నెలల లోపుపట్టా భూములుగా మార్చిపట్టాలు అందిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించడంపై రాష్ట్ర అసైన్ భూ సమితి రాష్ట్ర కార్యదర్శి బైండ్ల నందు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ వరంగల్ డిక్లరేషన్‌లో అసైన్డ్ భూములకు పట్టా భూములుగా మారుస్తామని పిఓటి యాక్ట్ 1977 రద్దుచేసి అసైన్ చేసిన రైతులకు పట్టా భూములుగా పట్టాలు అందిస్తామన్న వాగ్దానని నిలబెట్టుకుందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వ భూములలో ఇంత వరకు వ్యవసాయం చేసుకున్న రైతులకు అసలు భూమి రైతులు వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు పట్టాలు రెండు నెలలలో ఇస్తామన్న అందుకు రాష్ట్ర అసైన్మెంట్ తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా అదనపు ఎస్పి అడ్మిన్ మహేందర్



నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

ప్రజలు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మెదక్ జిల్లా అదనపు ఎస్పి మహేందర్ అన్నారు. సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదిదారుల నుంచి ఫిర్యాదులు జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ ఎస్.మహేందర్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్‌ల యొక్క ఎస్ఐ, సీఐలకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని పరిష్కారానికి ఆదేశించారు. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకొనేల, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి తెలియజేశారు. ప్రజా సమస్యలుపై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నాము అని తెలిపారు.

అమ్మిన లారీ నా పేరున ఉండి తీవ్రంగా నష్టపోయా

నవతెలంగాణ-రామాయంపేట : గతంలోనే అమ్మిన లారీ ఇప్పటికీ నా పేరుతోనే ఉండడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నానని రామాయపేట పట్టడానికి చెందిన మహ్మద్ ఇబ్రహీం ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 2014 సంవత్సరంలో ఏపీ26టి 6575 నెంబర్‌తో కామారెడ్డి శ్రీ రామ్ ఫైనాన్స్‌లో లారీ తీసుకున్నానని, ఆ లారీని ఫైనాన్స్ వాళ్లు ఇతరలకు విక్రయించారని తెలిపారు. కానీ ఆ లారీ ఇప్పటికీ ఆర్టిఏ రికార్డుల్లో తన పేరుతోనే ఉన్నదని, అందువల్ల తాను తీవ్రంగా నష్టపోతున్నట్లు వివరించారు. తనకు సొంత ఇల్లు లేదని, తన పేరుతో లారీ ఉండడం వల్ల డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వలేకపోతున్నట్లు అధికారులు తెలిపారన్నారు. ఆర్టిఏ రికార్డుల్లో తన పేరు తొలగించాలని అంతకుమునుపే ఆర్టిఏ అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగిన సమస్య పరిష్కారం కాలేదన్నారు. సమస్య పరిష్కారం కావాలంటే మధ్యవర్తుల తో రావాలని అధికారులు సూచిస్తున్నారని, మధ్యవర్తుల దగ్గరికి వెళ్ళితే లంచం అడుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఓ మధ్యవర్తి ద్వారా ఓ అధికారికి రూ. 4800 చెల్లించినట్లుగా తెలిపారు. తన పేరుతో లారీ ఉండడం వల్ల ప్రభుత్వ పథకాలు నష్టపోతున్నానని, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు రాకుండా పోయిందని, జిల్లా కలెక్టర్ స్పందించి తన పేరుతో ఉన్న లారీని ఆర్టిఏ రికార్డులో నుంచి తొలగించి, తన వద్ద లంచం డిమాండ్ చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-పాపన్నపేట



మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సోమవారం పాపన్నపేట మండలంలోని బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఇందులో భాగంగా ముందుగా మిన్పూర్ గ్రామానికి చెందిన జర్నలిస్ట్ శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించారు. ఇటీవల అతడి తల్లి మృతి చెందిన విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం మండల కేంద్రమైన పాపన్నపేటకు చెందిన కుర్షిద్ కుటుంబాన్ని పరామర్శించారు. అతడి భార్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి రోడ్డు ప్రమాదం ఎలా జరిగిందన్న విషయం అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పాపన్నపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోవింద నాయక్, నాయకులు ప్రశాంత్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, శెట్టి శ్రీకాంత్ అప్ప, శ్రీకాంత్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా 'నవతెలంగాణ'

- మున్సిపల్ చైర్మెన్ రాజమౌళి



నవతెలంగాణ- గజ్వేల్

ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా నవతెలంగాణ దినపత్రిక ఉంటూ ప్రజల మన్నలు పొందుతుందని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మెన్ నేతి చిన్న రాజమౌళి అన్నారు. నవతెలంగాణ దినపత్రిక వార్షికోత్సవంలో భాగంగా సోమవారం ఆయన చాంబర్లో మాట్లాడారు. గతంలో ప్రజాశక్తిగా ప్రజల మధ్య నుంచి ఎప్పటికప్పుడు సమస్యలను వెలికితీసి గత తొమ్మిది ఏళ్లుగా నవతెలంగాణ దినపత్రిక ప్రజల మధ్యన ఉంటుందని చెప్పారు. మంచి విశ్లేషణ కథనాలను ప్రజలకు అందిస్తూ చైతన్యం చేస్తుందని చెప్పారు. గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా కథనాలు అందిస్తుందని అన్నారు. ప్రభుత్వంలో కదిలికలు వచ్చేలా చేస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలకు నవతెలంగాణ విస్తరించాలని ఆకాంక్షిస్తున్నట్లు అన్నారు.

ప్రతి అక్షరం ప్రజల కోసమే

- వైస్ చైర్మెన్ జఖీర్



నవతెలంగాణ-గజ్వేల్

దశాబ్దాలుగా నవతెలంగాణ దినపత్రికలోని ప్రతి అక్షరం ప్రజల పక్షాన ఉంటుందని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ వైస్ చైర్మెన్ జఖీర్ అన్నారు. నవతెలంగాణ వార్షికోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ ప్రాంతంలో పత్రికకు మంచి ఆదరణ ఉందని అన్నారు. స్థానిక సమస్యలపై తక్షణమే స్పందిస్తూ వెలుగులోకి తెస్తున్నారని పేర్కొన్నారు. ప్రింట్ మీడియా రంగంలో నవతెలంగాణకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. అన్ని సామాజిక వర్గాలకు సంబంధించిన అంశాలను జోడిస్తూ పత్రిక ద్వారా రోజు ఉదయమే అందిస్తున్నారు. మునుముందు పత్రిక మరింత ప్రజా ఆదరణ పొందాలని ఆశిస్తున్నాను.

ప్రజావాణి దరఖాస్తుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



- జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణిలో భాగంగా జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి జిల్లా నలుమూలల నుంచి తమ సమస్యలు విన్నవించుకోవడానికి వచ్చిన అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ ప్రజావాణి వినతులు ఆయా శాఖల అధికారులు అర్జిదారులు మళ్లీ అర్జి పెట్టుకోకుండా సత్వరమే పరిష్కరించి న్యాయం చేయ్యాలన్నారు. భూ సంబంధిత, ఇండ్లు, ఆసరా పించన్లు మొత్తం దరఖాస్తులు 50 స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ నాగ రాజమ్మ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐని కలిసిన యూత్ కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలానికి నూతనంగా వచ్చినటువంటి సబ్ ఇన్స్పెక్టర్ విజయ భాస్కర్‌ను అక్కన్నపేట యూత్ కాంగ్రెస్ నాయకులు సోమవారం కలిసి సన్మానం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండలంలో ఉన్న లా అండ్ ఆర్డర్ సమస్యలపై ఎస్ఐకి తెలియజేశామన్నారు. దీనిపై ఎస్సై విజయభాస్కర్ కూడా సానుకూలంగా స్పందించి ఎలాంటి సమస్య ఉన్న డైరెక్ట్‌గా తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు బైకాని శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ నాయకులు పాంద్రాల దాము, చొక్కం గణేష్, త్రిమూర్తి, శ్రీనివాస్, రాజు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ టీఎస్‌కి రాజీనామాలు




నవతెలంగాణ-వర్గల్

పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ రాష్ట్ర అధ్యక్ష పదవికి సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గుంటి పల్లి ఉపాధ్యాయుడు శ్రీధర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి పదవికి వేలూరు పాఠశాల ఉపాధ్యాయుడు ఎం.సుధాకర్‌లు రాజీనామా చేశారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ విద్యా రంగానికి పట్టు కొమ్మలైన ఎస్జీటీల సమస్యల పరిష్కారం విషయంలో పీఆర్‌టీయూతో పాటు అన్ని సంఘాలు వైఫల్యం చెందాయని, ఎస్జీటీల సమస్యల విషయంలో పూర్తిగా నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్న కారణంగా పీఆర్‌టీయూ టీఎస్ సంఘ ప్రాథమిక సభ్యత్వానికి, పదవికి రాజీనామా చేస్తున్నట్లు, ఎస్‌జీటీయూ సంఘంలో చేరుతున్నట్లు తెలిపారు

వరి కాలిబాటలతో అధిక దిగుబడి

- ఏఈఓ శ్రీలత



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం జనగామ గ్రామంలో వరి పొలంలో కాలిబాటల గురించి ఏఈఓ శ్రీలత సోమవారం రైతులకు వివరించారు. ఈ సందర్భంగా రైతు ఒడ్డురాల రాజు పొలంలోకి దిగి కాలిబాటలు ఎలా తీసుకోవాలో వ్యవసాయ విస్తరణ అధికారి సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పొలంలో కాలిబాటలు ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్లు తీయాలని అన్నారు. దీనివల్ల వరి పైరులోకి గాలి, సూర్యరశ్మి ప్రవేశించి, దుబ్బులకు అధిక ఆక్సిజన్ అందిస్తుందని అన్నారు. దీనివల్లే కిరణజన్య సంయోగక్రియ జరిగి, పచ్చదనంతో అధిక దిగుబడులు వస్తాయని తెలియజేశారు. కాబట్టి రైతులు నాటు వేసే సమయంలో తప్పనిసరిగా కాలిబాటలను విడిచిపెట్టాలని తెలిపారు.

డిగ్రీ కళాశాలలో బీఆర్ఎస్వీ నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి యాదగిరి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ వీ కళాశాల కమిటీని ఏర్పాటు చేశారు. కళాశాల అధ్యక్షునిగా ఉదయ్ కుమార్, గర్ల్స్ కమిటీ అధ్యక్షురాలిగా కుమ్మరి రామ దేవి, కన్వీనర్‌గా రమ్యని నియమించారు. అనంతరం బదిలీలో వచ్చిన కళాశాల ప్రిన్సిపల్ సునీతను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కంకటి నవీన్ గౌడ్, పట్టణ అధ్యక్షులు మహిపాల్ గౌడ్, చిన్న కోడూరు మండల అధ్యక్షులు గుజ్జ రాజు, రూరల్ మండల అధ్యక్షులు బండి శ్రీకాంత్, నారాయణరావు పేట మండల అధ్యక్షులు ఆకుల సతీష్, అర్బన్ అధ్యక్షులు కోడెల నరేష్, ఇరుగంటి రమేష్, కాలేజీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణపై అవగాహన



నవతెలంగాణ-బెజ్జంకి

సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రజలందరూ తమ ఇంటి పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, అవగాహన కల్గి ఉండాలని పంచాయతీ కార్యదర్శి ప్రనీత్ రెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రధాన వీదులగుండా అయా పాఠశాలల విద్యార్థులతో కలిసి ఆరోగ్య కేంద్రం, ఐకేపీ, గ్రామ పంచాయతీ సిబ్బంది స్వచ్ఛందనంపచ్చదనం, తల్లిపాల ప్రాముఖ్యతపై ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో సీజనల్ వ్యాధులు నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామ పంచాయతీ రాత పరీక్ష పోటీలు నిర్వహించారు

అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యం పట్టివేత



నవతెలంగాణ-కోహెడ

మండలంలోని నారాయణపూర్ గ్రామ పరిధిలోని ఫకీర్‌పల్లిలో అక్రమంగా నిల్వచేశారనే సమాచారంతో సుమారు 23 క్వింటాళ్ళ అక్రమ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా బియ్యాన్ని తరలిస్తే చట్టరీత్య తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి, గుట్కాలాంటి మత్తు పదార్థాలను తరలిస్తే 100కు ఫోన్‌చేసి సమాచారం అందించాలన్నారు. ఆయనవెంట కానిస్టేబుల్‌లు రమేష్ నాయక్, మద్దెల నరేష్, తదితరులు ఉన్నారు.

రేషన్ షాపు పై చర్య తీసుకోవాలని వినతి



నవతెలంగాణ -నంగునూరు

నంగునూరు మండలంలోని బద్దిపడగ రేషన్ షాపు 3820027 పై చర్య తీసుకోవాలని సోమవారం కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేసినట్లు గ్రామస్తులు తెలిపారు. రేషన్ షాపు నిర్వాహకుడు పై పలు మార్లు సంబంధింత అధికారులపై పిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని వినతి పత్రంలో పొందు పరిచారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను సందర్శించిన కలెక్టర్



- జిల్లా కలెక్టర్ ఎం.మనుచౌదరి

నవతెలంగాణ-సిద్దిపేట

జిల్లా కలెక్టర్ ఎం.మనుచౌదరి ఆకస్మికంగా సిద్దిపేట పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను సందర్శించి, వ్యాపారులు కూరగాయలు, ఆకుకూరలు, మేక మాంసం, చేపలను అమ్ముకోవడానికి, హోల్ సేల్ వ్యాపారులు, కూరగాయలు అమ్ముకోవడానికి ప్రభుత్వం కల్పించిన సౌకర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ సెక్రెటరీ వెంకటేష్ 5 ఏళ్ల క్రితం రూ.25 కోట్ల కూరగాయలు, మటన్, చికెన్, చేపలు, హోల్ సేల్‌గా కూరగాయలను అమ్ముకోడానికి ప్రత్యేకమైన బ్లాక్‌లను నిర్మించిందని, వ్యాపారులకు వ్యాపారం చేయడానికి అవకాశం కల్పించిందని, మార్కెటింగ్ శాఖ ద్వారా సూపర్వైజర్, సెక్యూరిటీ, సానిటేషన్ వర్కర్స్ 14 మంది ఇందులో విధులు నిర్వహిస్తున్నారని జిల్లా కలెక్టర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మేకలను కోయడానికి స్లాటర్ హౌస్ ఇర్కోడ్‌లో ఉన్నదని అడిగి తెలుసుకొని వర్షాకాలంలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇచ్చి, మార్కెట్ పరిసరాలను ఎప్పుడు శుభ్రంగా ఉంచాలని, వినియోగదారులకు నాణ్యమైన తాజా కూరగాయలు, ఆకుకూరలు, మటన్, చికెన్, చేపలను మాత్రమే విక్రయించేలా పర్యవేక్షణ చెయ్యాలని ఆదేశించారు. నిర్ణిత ధరలకు మాత్రమే కూరగాయలు, హోల్ సేల్ అమ్మకాలు జరిగేలా చూడాలని మార్కెటింగ్ సెక్రెటరీ ని ఆదేశించారు. ఏదైనా సమస్యలు ఉంటే తన ద్రుష్టికి తీసుకు రావాలని సూచించారు.

ఉపాధి హామి కూలీల హక్కులను పరిరక్షించాలి

- కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శికి ఎన్ఎస్‌యం విన్నపం.
- జాబ్ కార్డుల తొలగింపు అన్యాయం
- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్



నవతెలంగాణ-గజ్వేల్

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ హక్కులను పరిరక్షించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి బృందానికి నరేగ సంఘర్షణ సమితి జాతీయ బృందం విజ్ఞప్తి చేసిందని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ తెలిపారు. సోమవారం డిల్లీ లోని కృషిభవన్‌లోని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయం లోఆరుగురి అధికార బృందం తో వివిధ రాష్ట్రాలకు చెందిన వివిధ దళిత, ప్రజా, కార్మిక సంఘాలకు చెందిన 15 మంది బృందం సుదీర్ఘంగా చర్చించినట్లు ఆయన స్థానిక విలేకరులకు ఒక ప్రకటనలో తెలిపారు. ఏడు డిమాండ్‌లను కేంద్ర ప్రభుత్వం దృష్టి కి తీసుకెళ్ళగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి శైలెష్ కుమార్ సింగ్ సానుకూలంగా స్పందించారన్నారు. తెలంగాణతో పాటు దేశ వ్యాప్తంగా గత రెండు నెలలుఅ వున్న పెండింగ్ వేతనాలను యుద్ధప్రాతిపాదికన చెల్లించాలని,పెండింగ్ వేతనాలకు నష్టపరిహారం కోరగా త్వరగా చెల్లిస్తామని హామి ఇచ్చారని తెలిపారు. గతంలో రాష్ట్రాలకు ఇచ్చిన విధంగా కార్పస్ నిధులు ఇస్తే వేతనాలు పెండింగ్ కాకుండా వుంటాయని గుర్తు చేసామన్నారు. కూలీల పని దరఖాస్తులను ఆన్లైన్‌లో నమోదు చేసి గ్రామ పంచాయతీలో రశీదు ఇవ్వాలని కొరగా చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చారని తెలిపారు. జాబ్ కార్డులలో ఎప్పటికప్పుడు పని దినాలను నమోదు చేయాలని విన్నవించాగా సానుకూలంగా స్పందించారని శంకర్ వివరించారు. మ్యానువల్ మస్టర్ రోల్ ను సైతం నిర్వహించాలని కోరామన్నారు. ఉపాధి చట్టాన్ని కి విరుద్ధంగా దేశవ్యాప్తంగా తొలగించిన 8.7 కోట్ల జాబ్ కార్డులను తిరిగి ఇవ్వాలని ,కూలీల ఆమొదం లేకుండా జాబ్ కార్డులను తోలగించ వద్దనిడిమాండ్ చేయగా అధికారులు సానుకూలంగా స్పందించారని తెలిపారు. తెలంగాణ లో 5 లక్షలకు పైగా జాబ్ కార్డులను తోలగించడం అన్యాయమని శంకర్ ప్రశించారు. సామాజిక తనిఖీ విభాగాలను పటిష్ఠం చేయాలని, తగిన నిధులను ఇవ్వాలని, అవినితిని ఆరికట్టెందుకు చర్యలు తీసుకొవాలని డిమాండ్ చేశామని శంకర్ తెలిపారు. పనిదినాలను వంద నుంచి రెండు వందల రోజులకు, కనీస వేతనాన్ని రూ.600 లకు పెంచాలని కొరామన్నారు. కేంద్ర బడ్జెట్ ను సవరించి.1.50 కోట్ల ను కేటాయించాలని కోరగా ప్రభుత్వం దృష్టి కి తీసుక వెళ్ళుతమని అధికారులు హామి ఇచ్చారని శంకర్ తెలిపారు. గత రెండేళ్లుగా అవినీతి పేరుతో పశ్చిమ బెంగాల్‌లో నిలిపివేసిన ఉపాధి హామి పనులు తిరిగి ప్రారంభించాల ప్రజా సంఘాల ప్రతినిధులు ముక్త కంఠంతో డిమాండ్ చేశామని తెలిపారు. కేంద్రం బృందంతో చర్చలు జరిపిన వారిలో నరేగ సంఘర్షణ మోర్చా జాతీయ సమన్వయ కర్త అర్జున్, అనురాధ (పశ్చిమ బెంగాల్), అభయ్ (కర్ణాటక), అశిష్, రంజన్(బీహార్) ముఖెష్(రాజస్థాన్), పి.శంకర్, పులి కల్పన (డీబీఎఫ్, తెలంగాణ), రాహుల్ (ఏపీ), రాజశేఖర్ (ఉత్తర ప్రదేశ్), నీతు (గుజరాత్), తదితరులు పాల్గొన్నారని పేర్కొన్నారు.

పిబ్రవరిలో డిల్లీ లో ధర్నా

ఉపాధి హామీ, ఆహర భద్రత చట్టాల అమలు పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ వచ్చె పిబ్రవరి లో డిల్లీలో ధర్నా నిర్వహించాలని నరేగ సంఘర్షణ మోర్చా, ఆహరభద్రత ప్రచారొద్యమ సంస్థలు నిర్ణయించాయని ఆయన చెప్పారు. గత నాలుగు రోజులుగా డిల్లీలో ఆగస్టు 2, 3, 4 తేదీ లలో మూడు రోజుల పాటు జాతీయ సమావేశాలు జరిగాయని తెలిపారు. కేంద్ర బడ్జెట్ లో ఉపాధి హామికి,ఆహరభద్రత కు నిధులు పెంచాలని జాతీయ సమావేశాలలో తీర్మానించామని తెలిపారు. ఫిబ్రవరిలో జరగనున్న పార్లమెంటు సమావేశాల సందర్భంగా డిల్లీలో మూడు రోజుల పాటు ధర్నా నిర్వహించాలని నిర్ణయించామని శంకర్ తెలిపారు.

నవోదయ విద్యాలయంలో అథ్లెటిక్ పోటీలు



నవతెలంగాణ-వర్గల్:

వర్గల్ మండల కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో క్లస్టర్ స్థాయి అథ్లెటిక్ పోటీలు ఈ నెల 7వ, 8వ తేదీలలో నివాహిస్తున్నట్లు నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ డీ.రాజేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అథ్లెటిక్ పోటీల్లో తెలంగాణలోని ఉమ్మడి జిల్లాలో ఉన్న తొమ్మిది నవోదయ విద్యాలయ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొంటారని అన్నారు. అదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్, నల్గొండ, ఖమ్మం, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లాలా విద్యార్థులు పాల్గొంటారు. సుమారు 100 మందికి పైగా విద్యార్థినీ విద్యార్థులు ఈ జిల్లాల నుంచి ఈ అథ్లెటిక్ పోటీలలో ప్రాతినిధ్యం వహిస్తారాని తెలిపారు. ఆగస్టు 7వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందని, ఆగస్టు 8వ తేదీ గురువారం సాయంత్రం ఐదు గంటలకు ముగింపు కార్యక్రమం ఉంటుందని అన్నారు. క్లస్టర్ స్థాయి పోటీల్లో ఎంపికైన విద్యార్థిని విద్యార్థులు ప్రాంతీయ స్థాయిలో జవహర్ నవోదయ విద్యాలయ , చిత్తూరు జిల్లా ఆంధ్రప్రదేశ్‌లో ఈనెల 12వ ,13వ, 14వ తేదీల్లో జరిగే ప్రాంతీయ స్థాయి అథ్లెటిక్ పోటీల్లో పాల్గొంటారని తెలియజేశారు.

వ్యవసాయరంగంలో సేవలందిస్తున్న బెస్ట్ ఆగ్రా లైఫ్ లిమిటెడ్

- మార్కెట్లో విస్తరిస్తున్న బెస్ట్ అగ్రో లైఫ్ లిమిటెడ్
- బెస్ట్ ఆగ్రా లైఫ్ లిమిటెడ్ నూతన ఉత్పత్తి రిలీజ్
- మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ బాలాజీ ప్రసాద్



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్, గజ్వేల్



రైతులకు వ్యవసాయ రంగంలో ది బెస్ట్ అగ్ర లైఫ్ లిమిటెడ్ ముందు వరుసలో ఉంటూ లబ్ది చేకూరుస్తుందని మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ బాలాజీ ప్రసాద్ అన్నారు. భారతదేశము స్వదేశీ విజ్ఞాన పరిజ్ఞానంతో మార్కెట్లోకి విస్తరిస్తున్న బెస్ట్ ఆగ్రో లైఫ్ లిమిటెడ్ వారు నూతన ఉత్పత్తులను మార్కెట్లోకి విడుదల చేశారు. సోమవారం గజ్వేల్ లో బెస్ట్ అగ్రో లైఫ్ లిమిటెడ్ వారు నిర్వహించిన కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ బాలాజీ ప్రసాద్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో వచ్చు నూతన సవాళ్లను స్వీకరిస్తూ అగ్రగామి సంస్థగా భారత దేశంలో అడుగుపెడుతున్న సంస్థల్లో బెస్ట్ ఆగ్రా లైఫ్ లిమిటెడ్ ముందు వరుసలో ఉంటుందని వివరించారు. కంపెనీ 450 క్రిమిసంహారక ఉత్పాదకాలను రిజిస్ట్రేషన్ చేశామన్నా రు. 40 కొత్త ఉత్పత్తులను మార్కెట్లోకి విడుదల చేయడానికి బెస్ట్ ఆగ్రో లైఫ్ సిద్ధంగా ఉందని ప్రస్తుతం ఈ ఖరీఫ్ సీజన్లో మార్కెట్లోకి ఆరు నూతన ఉత్పత్తులను విడుదల చేశారన్నారు. అందులో వార్డెన్ ఎక్స్‌ట్రా, ఒరుసేలం, నిమజి న్, డిపేండర్, స్పైనోషర్, స్పైటోకాన్, అనే ఆరు రకాల మందులను ఈ ఏడాది విడుదల చేసిందని వివరించారు. ఉత్పత్తులకు సంబంధించి టెక్నికల్ ప్రజెంటేషన్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ శ్రీ సారా నరసయ్య వివరించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ వెంకట్ రెడ్డి ఏజీఎం శ్రీ బొజ్జం వెంకటేష్, సీనియర్ రీజినల్ మేనేజర్ శ్రీ రావుల నరేష్ రెడ్డి, ఫీల్డ్ మార్కెటింగ్ ఆఫీసర్ శ్రీ దుంబాల దినేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ యొక్క మెదక్ జిల్లా రంగారెడ్డి జిల్లా డీలర్ సుమారు 150 మంది డీలర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టెర్రటరీ సేల్స్ మేనేజర్లు రెడ్డి, భార్గవ్ రెడ్డి, సేల్స్ ఆఫీసర్ చిట్టా పురం కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ మాసం ఆరంభంతో ప్రత్యేక పూజలు ప్రారంభం



నవతెలంగాణ-తొగుట

శ్రావణ మాసం ఆరంభం కాగానే ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. సోమవారం మల్లన్నసాగర్ ముంపు గ్రామం ఏటిగడ్డ కిష్టాపూర్ సమీపంలో వాగుగడ్డ హనుమాన్ మందిరంలో శ్రావణ మాస ప్రత్యేక పూజలు ప్రారంభం అయ్యాయి. ఈ శ్రావణ మాసంలో ప్రతి సోమవారం, శనివారం ఈ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ చుట్టుపక్కల కొన్ని గ్రామాలు ముంపునకు గురైనప్పటికీ, వారు ఎక్కడున్నా ఈ క్షేత్రాన్ని సందర్శించి వారి మొక్కులను చెల్లించుకుంటారు. ఈ శ్రావణ మాసంలో ఆఖరి శనివారం రోజున పెద్ద ఎత్తున జాతర కొనసాగుతుంది. ఇట్టి జాతరకు చుట్టుపక్కల గ్రామాల నుంచి వేల సంఖ్యలో ప్రజలు హాజరవుతారు. ఈ గుడిలో గండ దీపం అనే సాంప్రదాయం చాలా ప్రత్యేకత ఉంది. ఈసారి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దాతారు రవీందర్ మాట్లాడుతూ చుట్టూ ఉన్న పది, పదిహేను గ్రామా లు ఎంతో నమ్మకంగా కొలిచే దైవమని అన్నారు. ఈ దేవాలయంలో కోరుకున్న ప్రతి మొక్కులు తీరుతాయని తెలిపారు. ప్రత్యేక పూజా కార్యక్రమంలో బిగ్ బాస్ ఫెమ్ పల్లవి ప్రశాంత్ పాల్గొన్నారని చెప్పారు.

నిరుపేద విద్యార్థుల అభివృద్ధి కోసం కృషి చేస్తా

- ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మెన్ గాదగొని చక్రధర్ గౌడ్



నవతెలంగాణ-నంగునూరు

నిరుపేద విద్యార్థుల అభ్యున్నతకు కృషి చేస్తానని ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మెన్, కాంగ్రెస్ నాయకులు గాదగొని చక్రధర్ గౌడ్ అన్నారు. సోమవారం నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాసర త్రిపుల్ ఐటీలో సీటు సాధించిన 22 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున మొత్తం రూ.1.10 లక్షల ఆర్థిక సహాయం చేసి విద్యార్థులను వారి తల్లిదండ్రులను సన్మానించి ప్రోత్సాహన్ని అందించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నారని, ఉన్నత విద్య చదివిన ఉపాధ్యాయులున్నారని పేర్కొన్నారు. ఎవరైనా నిరుపేద విద్యార్థులకు ఉన్నత విద్యలో ఆర్థిక సహాయం కావాలంటే తనను సంప్రదించాలని సూచించారు. రైతులకు సేవచేయడం అంటే నాకు చాల సంతోషం కలుగుతుందని తెలిపారు. అదే విధంగా పేద విద్యార్థుల కష్ట సుఖాలను చూసిన వాణ్ణి కనుక విద్యార్థులకు తన వంతు సహాయం ఎల్లవేళలా అందిస్తానని చెప్పారు. గతంలో నంగునూరు ఉన్నత పాఠశాలలో చదివి బాసర త్రిపుల్ ఐటీలో ఇంజనీరింగ్ పూర్తి చేసి ఇటీవల టీఎస్‌పీఎస్సీ విడుదల చేసిన ఫలితాలలో ఇరిగేషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఎంపికైన చిప్ప రవళిని సన్మానించి అభినందించారు. చిప్ప రవళిని స్పూర్తిగా తీసుకొని విద్యార్థులందరూ పోటీపడి చదివి ఉద్యోగ అవకాశాలను పొంది సమాజానికి సేవ చేయాలన్నారు. వచ్చే ఏడాది కూడా ఎంతమంది విద్యార్థులు త్రిపుల్ ఐటీ సాధించిన వారందరికీ ఆర్థిక సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొట్టిపర్తి రామస్వామి గౌడ్, కాంగ్రెస్ నాయకులు గోనెపల్లి శివ ప్రసాద్ గౌడ్, రంగు అశోక్ గౌడ్, గౌరబోయిన రాజు, నవీన్, గణేష్, నీల రాకేష్, సాయి శ్యామ్, ముగ్రం, అజ్జు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

రాజ్యాంగబద్ధమైన న్యాయం చేయాలి




నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

ఎస్సీ వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు ఇచ్చిన వివాదాస్పద తీర్పు పట్ల జాతీయ, రాష్ట్ర మాల, మాల ఉప కులాల సంఘాలు సుప్రీంకోర్టు తీర్పును పున్హ పరిశీలించి తగు రాజ్యాంగ బద్ధమైన న్యాయం చేయవలసినదిగా కోరుతున్నామని అన్నారు. జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) శ్రీనివాస్ రెడ్డికి దరఖాస్తు ఇచ్చారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ బద్దంగా, న్యాయ బద్దంగా లేదు. ఈ వి.చిన్నయ్య కేస్ లో సుప్రీంకోర్టు (5) గురు జడ్జిల ధర్మాసనము ఇచ్చిన తీర్పును పూర్తిగా పరిగణనలోకి తీసుకోకుండా మరోసారి ఎస్సీ వర్గీకరణ తీర్పు (6:1) జడ్జిల రాజ్యాంగ స్పూర్తిని పరిగణనలోకి తీసుకోని తీర్పును ఇచ్చారు అన్నారు. రాజ్యాంగ నిర్మాణ సభలో చైర్మెన్ డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ స్పష్టంగా షెడ్యూల్ కులాల జాబితాపై తన వాదనను వినిపిస్తు అధికరణ 341 ను రాజ్యాంగ సభ సంపూర్ణముగా ఆమోదం తెలుపుతూ ఏదైనా ఈ అధికరణ పై సవరణలు చేయాలని అనుకుంటే రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం లేదని వారన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో రాజ్యాంగ పార్లమెంట్లో తీర్మానం ప్రకారం రాష్ట్రపతి ఆమోదం పొందిన తరువాత మాత్రమే అమలులోకి వస్తాయి. ఎస్సీ, ఎస్టీల సంబంధించి ఏవైనా రాజ్యాంగ మార్పులు నిర్ణయాలు తీసుకోవాలని అనుకుంటే రాష్ట్రపతి ఆమోదం తప్పనిసరి. ఈ అంశాలను చెన్నయ్య కేసులో సుప్రీంకోర్టు లో (5) గురు జడ్జిల ధర్మాసనం స్పష్టంగా తెలుపుతూ ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి విద్యా రంగంలో 2004 ఏడాదిలో సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు ఇచ్చిందన్నారు. వీటిని పరిశీలించకుండా ప్రస్తుతం (6) గురు జడ్జిలు రాజ్యాంగ ఆదేశ సూత్రాలకు ప్రతికూలమైన తీర్పు ఇచ్చినట్లు ఉందన్నారు. న్యాయమూర్తి ఏకీభవించలేదని జవాన్ కాబట్టి వర్గీకరణ పై సుప్రీంకోర్ట్ తీర్పు రాజ్యాంగ బద్దంగా లేదని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నాలో పాల్గొన్నారు.

మల్లన్న సాగర్ భూ నిర్వాసితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి

- సీపీఐ గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివ లింగుకృష్ణ




నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మల్లన్న సాగర్ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టి దాదాపు ఆరు ఏళ్ల పూర్తయిన భూనిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం ఇప్పటివరకు అందలేదని సీపీఐ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగు కృష్ణ తెలిపారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వారికి రావలసిన పరిహారంకు సంబంధించి దరఖాస్తులు అడిషనల్ కలెక్టర్‌కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంపు గ్రామాల ప్రజలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, ఒంటరి మహిళలకు డబల్ బెడ్ రూమ్ ఇల్లు రిజిస్ట్రేషన్, 18 ఏళ్ల పైబడిన యువతకు ప్యాకేజీ, ప్లాట్ రిజిస్ట్రేషన్, కొన్ని అసైన్డ్ భూముల పరిహారాలు కూడా గత ప్రభుత్వం పూర్తిస్థాయిలో చెల్లించలేదని, దీని కొరకు దాదాపు ఆరు ఏళ్ల నుంచి ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్నో దరఖాస్తులు ఇచ్చినప్పటికీ ఈ సమస్యలు పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. కావున తెలంగాణ రాష్ట్ర నూతన ప్రభుత్వం వెంటనే నిర్వాసితుల పరిహారాలను అందించాలని లేనియెడల నిర్వాసితులను ఏకం చేసి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మల్లన్న సాగర్ ముంపు గ్రామాల నిర్వాసితులు, సీపీఐ పార్టీ పల్లెపహాడ్ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

అరుదైన కణతుల్ని తొలగించిన దుబ్బాక వైద్యులు



నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాక పురపాలికలోని ప్రభుత్వ ఏరియా వంద పడకల ఆసుపత్రి వైద్యులు సోమవారం మరో మూడు ఆపరేషన్లు చేసి అరుదైన కణతుల్ని విజయవంతంగా తొలగించారు. సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్ సింగ్ తెలిపిన వివరాలు లావణ్యకు మూడున్నర కిలోల మల్టీపుల్ ఫెడక్యూలేటెడ్ ఫైబ్రాయిడ్, దీక్షితకు 5.5 కిలోల ఓవరియన్ సిస్ట్, లక్ష్మీకి 2 కిలోల ఫైబ్రాయిడ్ కణతుల్ని శస్త్రచికిత్స చేసి విజయవంతంగా తొలగించారన్నారు. ఎలాంటి వైద్య సేవలు అందించడానికైనా తాము సిద్ధంగా ఉన్నామని, ప్రజలు దుబ్బాక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వచ్చి తమ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఆయన వెంట ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

దళిత మహిళపై పోలీసుల దాడి హేయమైన చర్య

- ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రోళ్ల రవిబాబు



నవతెలంగాణ-సిద్దిపేట

అకారణంగా దొంగతనం నెపంతో పోలీసులు దళిత కులానికి చెందిన సునీతమ్మను, ఆమె కుటుంబ సభ్యులను విచక్షణ రహితంగా కొట్టడం అత్యంత హేయమైన చర్య అని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రోళ్ల రవిబాబు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ దాడికి పాల్పడిన పోలీస్ అధికారి డీఐ రామ్‌రెడ్డి, ఇతర పోలీసు అధికారుల పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, విధుల నుంచి శాశ్వతంగా బహిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా పోలీస్ ఉన్నతాధికారి, రాష్ట్ర ముఖ్యమంత్రి యనమల రేవంత్ రెడ్డి పూర్తి బాధ్యత వహించాలని కోరారు. రాష్ట్రంలో భవిష్యత్తులో ఎక్కడ దళితుల మీద అకారణంగా దాడులు జరిగిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని, బాధిత కుటుంబానికి మెరుగైన వైద్య సహాయము, ఆర్థిక సహకారాన్ని అందించి, కుటుంబాన్ని అన్ని రకాలుగా ఆదుకోవాలని కోరారు. లేనిచో ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టడానికి సిద్ధమవుతుందని హెచ్చరించారు.

సుప్రీం కోర్టు తీర్పు..న్యాయానికి రాజమార్గం

- స్వాగత కార్యక్రమంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి
- ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికిన మాదిగ సామాజిక వర్గం నాయకులు



నవతెలంగాణ-బెజ్జంకి

ఎన్నో ఎండ్లుగా అన్యాయానికి గురవుతున్న మాదిగ సామాజిక వర్గాల ప్రజలకు ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు వెలువరించిన చారిత్రాత్మక తీర్పు న్యాయానికి రాజమార్గమని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఎస్సీ వర్గీకరణ తీర్పు అనంతరం మొదటిసారి నియోజకవర్గానికి విచ్చేసిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు మండలంలోని మాదిగ సామాజిక వర్గాల నాయకులు సోమవారం బెజ్జంకి క్రాసింగ్ గ్రామ స్టేజ్ వద్ద హారతిచ్చి గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఎస్సీ వర్గీకరణ అమలుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా ఉన్నారని ఎమ్మెల్యే కవ్వంపల్లి అన్నారు. హైదరాబాదు యందు నిర్వహించనున్న మాదిగ సమ్మేళనానికి నియోజకవర్గంలోని నాయకులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. మండల కాంగ్రెస్ నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు హాజరయ్యారు.

పెద్ద మొత్తంలో సెంట్రింగ్ డబ్బాల చోరీ యత్నం

నవతెలంగాణ-ములుగు



సిద్దిపేట జిల్లా ములుగు మండలం అచ్చాయి పల్లి గ్రామ శివారులో పెద్ద మొత్తంలో సెంట్రింగ్ డబ్బాలను చోరీ చేసేందుకు యత్నించారు. గజ్వేల్ సర్కిల్ రూరల్ సిఐ పి మహేందర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అచ్చాయి పల్లి గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న భవనం వద్ద అర్ధరాత్రి వేళల్లో దుండగులు సెంట్రింగ్ డబ్బాలు అపహరించే ప్రయత్నం చేయగా, పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులను మెడ్చల్ జిల్లా పూడూరు గ్రాగ్రామానికి చెందిన పి మహేష్, నర్సింగరావు, రాజు,భూమేష్, అష్రఫ్, రమేష్‌గా గుర్తించారు. నిందితులు మే 20వ తేదిన ములుగు గ్రామ శివారులో ఇంటి వద్ద నిలిపి ఉన్న ఆటోను దొంగిలించినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో ములుగు ఎస్సై విజయ్ కుమార్, పోలీస్ సిబ్బంది

తల్లిపాలు సహజ సమతుల్య ఆహారం

- అయా గ్రామాల్లోని అంగన్వాడీల్లో తల్లిపాల వారోత్సవాలు
- చిన్నారులకు అన్నప్రసాన

నవతెలంగాణ-బెజ్జంకి



శిశువులకు రోగ నిరోధక శక్తితో పాటు ఎన్నో విలువైన పోషకాలందించే తల్లిపాలు సహజ సమతుల్య ఆహారమని ఏఎన్ఎం కనగండ్ల వినోద గర్భిణీలకు సూచించారు. శనివారం మండల పరిధిలోని లక్ష్మీపూర్, కల్లేపల్లి, చీలాపూర్ గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లోని ఉపాధ్యాయులు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అయా గ్రామాల్లోని గర్భిణీలకు అంగన్వాడీ కేంద్రాల ద్వార అందజేస్తున్న పౌష్టికాహారంపై ఏఎన్ఎంలు, అంగన్వాడీ ఉపాధ్యా యులు ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రసాన నిర్వహించారు. అంగన్వాడీ ఉపాధ్యాయులు ముక్కీస వెంకట లక్ష్మి, భూ లక్ష్మి, అనురాధ, కవిత, ఆశా కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

నవతెలంగాణ- సిద్దిపటరూరల్



తల్లిపాలు పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యమని అంగన్వాడి సూపర్వైజర్ వసంత అన్నారు. అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల భాగంగా సోమవారం నారాయణరావుపేట మండల పరిధిలోని గుర్రాల గొంది గ్రామంలో అంగన్వాడి కేంద్రం-2 లో బాలింతలకు గర్భిణీ స్త్రీలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవజాత శిశువుకు తల్లిపాలు ఇవ్వడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని పుట్టిన వెంటనే తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి అరుణ, డాక్టర్ శ్వేత, అంగన్వాడి టీచర్ రేణుక, చిలుక, అంజమ్మ, ఆశ వర్కర్లు మహిళలు పాల్గొన్నారు.

నవ తెలంగాణ - సిద్దిపేట



తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మున్సిపల్ కౌన్సిలర్ దాసరి భాగ్యలక్ష్మి శ్రీనివాస్ అన్నారు. సోమవారం పట్టణంలోని కాళ్ల కుంట కాలనీలో గల అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలలో కౌన్సిలర్ పాల్గొని మాట్లాడారు. బిడ్డ పుట్టిన గంటలోపు పిల్లలకు ముర్రుపాలు తాగించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని పొందాలని చెప్పారు. గర్భవతులు బాలింతలు క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు మధ్యాహ్న భోజనానికి రావాలని కోరారు. ఏఎన్ఎం జలజ మాట్లాడుతూ ప్రతినెల పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా ఇప్పించాలని చెప్పారు. గర్భం దాల్చిన ప్రతి మహిళ ఆశా వర్కర్ తో పాటు అంగన్వాడీ కేంద్రాలలో తమ పేరు నమోదు చేయించుకోవాలని తెలిపారు. తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తూ బాలామృతం ప్యాకెట్లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు జ్యోతి, అరుణ, యమునా, ఆశా వర్కర్ మాధవి, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.


నవ తెలంగాణ-రాయపోల్:



బిడ్డ పుట్టిన గంటలోపే తల్లి పట్టే ముర్రుపాలు శిశువుకు ఎంతో పౌష్టిక ఆహారం, డబ్బా పాలు వద్దు తల్లి పాలు ముద్దు అని బాలవ్వ, నాగరాణి, రజిని కుమారి అన్నారు. సోమవారం దౌల్తాబాద్ మండలం సూరంపల్లి గ్రామంలో అంగన్వాడీ కేంద్రాలలో అంగన్వాడీ టీచర్ల ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడి నేటి సమాజంలో పుట్టిన బిడ్డలకు తల్లిపాలు ఇవ్వడంలో మొహమాట పడుతున్నారని, అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి పాలు ఎంతో శ్రేయస్కరమని తెలిపారు. ఆరు నెలల తర్వాత అనుబంధ ఆహారం ప్రారంభించినప్పటికీ తల్లిపాలు బిడ్డకు పడుతూనే ఉండాలని తెలిపారు. బిడ్డకు పుట్టిన వెంటనే పట్టిన తల్లి పాలు మొదటి టీకాలుగా పని చేస్తాయన్నారు. శిశు మరణాలు తగ్గించాలంటే తప్పనిసరిగా పిల్లలకు తల్లిపాలు అందించాలన్నారు. తల్లిపాలు తాగే పిల్లలలో వికాసం, అభివృద్ధి పోత పాలు తాగే పిల్లల కంటే అధికంగా ఉంటుందన్నారు. పోత పాల వలన పిల్లలు వ్యాధుల బారిన పడే అవకాశాలు అధికంగా ఉంటాయన్నారు. గర్భిణీ మహిళలు అందరూ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించకుండా సమతులాహారం తీసుకుంటూ పుట్టబోయే బిడ్డలకు ఖచ్చితంగా తల్లిపాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం పుష్పలత, ఆశ వర్కర్ రేణుక, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మెదక్ పార్లమెంటు ఇంచార్జిగా రాజేందర్


నవతెలంగాణ-చేర్యాల



తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్ టిఎస్) మెదక్ పార్లమెంటు నియోజవర్గ ఇంచార్జిగా చేర్యాల పట్టణ కేంద్రానికి చెందిన భూమిగారి రాజేందర్ ను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఉమ్మడి జిల్లాలకు పార్లమెంటు ఇంచార్జీలను ప్రకటించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఎమ్మార్పీఎస్‌ను బలోపేతం చేస్తూ, ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఎగురవేస్తానని తెలిపారు.

ఎస్ఐని కలిసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-చేర్యాల



చేర్యాల ఎస్ఐ గా బాధ్యతలు చేపట్టిన పి.నీరేష్ ను సోమవారం పోలీస్ స్టేషన్‌లో కాంగ్రె స్ నాయకులు, ఆ పార్టీ కౌన్సిలర్లు మర్యాదపూర్వ కంగా కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానిం చారు. ఎస్ఐని కలిసిన వారిలో కాంగ్రెస్ చేర్యాల పట్టణ అధ్యక్షుడు మంచాల చిరంజీవులు, కౌన్సిలర్లు చెవిటి లింగం, తుమ్మలపల్లి సంజీవులు, ఆడెపు నరేందర్ దాసరి శ్రీకాంత్ , తదితరులు ఉన్నారు.

సేవారత్న పురస్కారాలకు ఆహ్వానం

నవతెలంగాణ- గజ్వేల్



ఈనెల 7వ తేదీన హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో జరిగే సేవారత్న పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమానికి రావాల్సిందిగా శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు కి గజ్వేల్‌కు వచ్చి ప్రత్యేక ఆహ్వాన పత్రాన్ని సోమవారం అందజేశారు. లక్ష్మీ ప్రసన్న చారిటేబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక, చైర్మెన్, ప్రముఖ గాయని లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలోరామకోటి సంస్థకు ప్రత్యేక ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఆహ్వానించడం చాలా ఆనందంగా ఉందని రామకోటి రామరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో సామ శ్రీధర్ గుప్త సినీ నిర్మాత, గౌడ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పంజాల వెంకటేష్ గౌడ్, వంగపల్లి అంజయ్య స్వామి పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటం అందజేత

నవతెలంగాణ-మర్కుక్



మండల పరిధిలోని చేబర్తి గ్రామపంచాయతీ కార్యాలయా నికి సీఎం రేవంత్ రెడ్డి చిత్రవ టాన్ని కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు ర్యాకం యాదగిరి అందజేశారు. సోమవారం గ్రామ స్పెషల్ ఆఫీసర్ తహసీల్దార్ ఆరిపా గ్రామపంచాయతీ కార్యదర్శి సిద్దేశ్వర్‌కు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని అందజేశారు

ఘనంగా స్వచ్ఛదనం-పచ్చదనం

నవతెలంగాణ-కొండపాక

పచ్చదనం పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని ఆ దిశగా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ గరీమా అగర్వాల్ అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు విధులను పరిశీలించి ప్రజలకు సూచనలు చేశారు. ప్రతి ఇంటిలో మరుగుదొడ్డి ఉండాలని చెప్పారు. గ్రామంలో మురికి కాలువలను శుభ్రంగా ఉంచుకోవాలని పరిసరాలను పరిశుభ్రతతో ఉంచాలన్నారు. ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలన్నారు. గ్రామంలోని పలు వీధులను పరిశీలించి పాఠశాలలో శ్రమదానం నిర్వహించారు. అనంతరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులను అంశాలపై ప్రశ్నలు అడిగారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, స్పెషల్ ఆఫీసర్ ప్రియదర్శిని పలువురు జిల్లా ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ- గజ్వేల్

స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమములో భాగంగా సోమవారం గజ్వేల్ మండలం అహ్మదిపూర్ గ్రామంలో స్వచ్ఛదనం పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గజ్వేల్ స్పెషల్ ఆఫీసర్ ఎమ్మార్వో శ్రావణ్ కుమార్ పాల్గొని, పంచాయతీ సెక్రటరీ కుమార్ స్వామి ఆధ్వర్యంలో స్థానిక నాయకుల స్వయం సహాయక సంఘాలు, యువజన సభ్యులతో సమావేశమై ర్యాలీ నిర్వహించారు. అనంతరం పంచాయతీ సెక్రటరీ కుమార్ స్వామి, స్పెషల్ ఆఫీసర్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ స్వచ్ఛందనం పచ్చదనం కార్యక్రమాలు 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. దీనిలో భాగంగా ప్రతిరోజు దోమల పైన శానిటైజర్ మురికి కాలువలు శుభ్రపరచడం. దోమలు రాకుండా జాగ్రత్తలు చేపట్టవలసిన కార్యక్రమాల గురించి తెలియజేస్తూ ముఖ్యంగా వీధి కుక్కల వల్ల ముప్పుపై ఐఈసీ ప్రచారం నిర్వహించాలని, అలాగే గృహ స్థాయిలో చెత్తను వేరు చేయాలన్నారు. పారిశుద్ధ్యం తోటలో పెంపకం వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి డెంగ్యూ, మలేరియా లపై ప్రచారం నిర్వహించాలన్నారు. మనం తాగే నీరు ప్రతిరోజూ శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యం, ఎండి హైమద్, మంద నరసింహులు, కోత్తపల్లి ఎల్లగౌడ్, బోయిని రామ్ చంద్రం, బొర్రన బాల్ రాజు గౌడ్, అందోల్ నరసింహులు, లచ్చిరెడ్డి, పాల రాములు గౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్లు, కరబర్ స్వామి,ఆశ వర్కర్లు , అంగన్వాడీ టీచర్లు, గ్రామ పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-అక్కన్నపేట

ప్రతి చెట్టు ప్రగతికి మెట్టని ఎంపీడీవో జయరాం, ఎస్సై విజయభాస్కర్ అన్నారు. సోమవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో కాంగ్రెస్ నాయకులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛతనం పచ్చదనం కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అట్టహాసంగా నిర్వహిస్తోందని, దీనిలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అన్నారు. అంతేకాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. ప్రస్తుత కాలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారాల పేరుతో మొక్కలు నరికేస్తున్నారని, ఒక్క మొక్క చనిపోతే మన ఆయుష్షులో ఎంతో కొంత తగ్గినట్టే అని అన్నారు. ఒకప్పుడు పల్లెల్లో పచ్చదనం ఉట్టిపడేదని, ప్రస్తుతం పల్లెల్లోకి కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారం ఎంటర్ అయి మొక్కలన్ని నరికే పరిస్థితి ఏర్పడుతుందని, దాన్ని రూపుమాపాలని తెలియజేశారు. ఢిల్లీ లాంటి రాష్ట్రాల్లో మొక్కలు సరిగ్గా లేకపోవడం వల్ల వాయు కాలుష్యం పెరిగిపోయిందని, కనీసం మానవులు శ్వాస తీసుకోవడానికి ఆక్సిజన్ దొరకడం లేదని అన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు పెద్ది ప్రవీణ్ కుమార్ గౌడ్, తాజా మాజీ సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి, పంచాయతీ సెక్రెటరీ లక్ష్మి కాంతారావు, టీఏ ఉమేష్, హెడ్ కానిస్టేబుల్ రామస్వామి, సింగిల్ విండో డైరెక్టర్ బండి కుమార్, యూత్ కాంగ్రెస్ నాయకులు పాంద్రాల దాము, రాజు నాయక్ , తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- గజ్వేల్

స్వచ్ఛదనం పచ్చదనంపై అవగాహన ర్యాలీని ముఖ్యఅతిథి ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి తో కలిసి ప్రారంభించిన మున్సిపల్ చైర్మెన్ రాజమౌళి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరిగే స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిశుభ్రం చేయాలని పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్వచ్ఛదనం-పచ్చదనము కార్యక్రమ ప్రారంభోత్సవంలో భాగంగా ఎన్‌సీ రాజమౌళి ఆధ్వర్యంలో కౌన్సిలర్, సభ్యులు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలు, నాయకుల చేత పురపాలక సంఘ కార్యాలయం నుంచి అంగడిపేట హనుమాన్ ఢీల్లీవలా హోటల్ నుంచి తిరిగి మున్సిపల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ గోల్కొండ నర్సయ్య, వైస్ చైర్మెన్ జకీర్, కౌన్సిల్ సభ్యులు దుంబాల లక్ష్మీ కిషన్ రెడ్డి, తలకొక్కుల భాగ్య లక్ష్మీ దుర్గాప్రసాద్, అల్వల బాలేష్, అతేల్లి శ్రీనివాస్, పంబాల అర్చన శివ కుమార్, బొల్లిపల్లి బాలమణి శ్రీనివాస్, బొగ్గుల చందు, కో ఆప్షన్ సభ్యులు ఉమర్, ఏఈ శ్రీధర్ రెడ్డి, సానిటరీ ఇన్స్పెక్టర్ రవీందర్, సీనియర్ అసిస్టెంట్ సుధాకర్, నాయకులు, వైద్యశాఖ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, మెప్మా సిబ్బంది, పురపాలక సిబ్బంది, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం జనగామ గ్రామంలో ప్రభుత్వం హట్టహాసంగా ప్రవేశపెట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం పాఠశాల విద్యార్థులకు కార్యదర్శి జమునరాణి ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ రుహిణ తస్కీన్ పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచి వాటిని సంరక్షించాలని అన్నారు. ప్రతి చెట్టు ప్రగతికి మెట్టని తెలిపారు. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం చంద్రకళ, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నంగునూరు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం నంగునూరు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ర్యాలీలు చేపట్టారు. ప్రధాన వీధుల గుండా తిరుగుతూ పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. గ్రామ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి ఐదు రోజుల ప్రణాళిక పై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బి.లక్ష్మప్ప, నంగునూరు ప్రత్యేక అధికారి వై.పద్మ, సూపరింటెండెంట్ ప్రభాకర్ రావు, ఎంపీఓ సత్యనారాయణ, మాజీ ప్రజాప్రతినిధులు, వైద్య, ఐకేపీ ఈజీఎస్ సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- గజ్వేల్

ప్రతి గ్రామంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గజ్వేల్ మండలం అక్కారం స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర రావు అన్నారు. సోమవారం ఈ కార్యక్రమం పై గ్రామ సభ, ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో మొక్కలు నాటాలని, గ్రామాన్ని శుభ్రం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ యాదగిరి, నాయకులు గొల్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మద్దూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని మద్దూరు, దూళ్మిట్ట, మండలాల్లోని అన్ని గ్రామాలలో స్పెషల్ అధికారుల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సంజీవ్ కుమార్, ఎంపీడీవో రామ్మోహన్‌లు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని గ్రామాలలో విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రమేష్, పంచాయతీ కార్యదర్శులు గద్ద వెంకటేశ్వర్లు, మాధవ్ జాదవ్, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, ఇంటిని శుభ్రంగా ఉంచుకున్నట్టు తమ వార్డులను కూడా ప్రజలు శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు ప్రజలకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం పట్టణంలో అన్ని వార్డులలో ఉదయం 9 గంటలకు ప్రారంభించారు. మున్సిపల్ చైర్ పర్సన్ కడవేర్గు మంజుల రాజనర్సు, వైస్ చైర్మెన్ జంగిటి కనకరాజు, ఇంచార్జి కమిషనర్ ప్రేరణలు 31వ, 16వ, 32వ, 33వ, 34వ వార్డులలో కౌన్సిల్ సభ్యులతో కలిసి స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక నాయకులు, ఎస్‌జీహెచ్ సభ్యులు, యూత్, వార్డు సభ్యులు, పట్టణ ప్రజలతో కలిసి స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. వార్డులలో పర్యటిస్తు పట్టణ ప్రజలకు చెత్తను తడి, పొడి, హానికర చెత్తగా వేరు చేసి ఇవ్వాలని అవగాహన కల్పిస్తూ వార్డులో అక్కడక్కడ ఉన్న చెత్తను తొలగించారు. వార్డులలో పట్టణ ప్రజలు సైతం స్వచ్ఛందంగా పాల్గొంటూ, శ్రమదానం చేస్తూ పిచ్చి మొక్కలు, చీడు, చెత్త తొలగించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, దోమలు, ఈగల వలన మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వ్యాపిస్తాయని, మన ఇంటిని మన ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల పట్ల వ్యాసరచన పోటీలు నిర్వహించి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఉన్న చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మెన్ కడవేర్గు రాజనర్సు, కౌన్సిల్ సభ్యులు బర్ల మల్లికార్జున్, మోయిజ్, బందారం శ్రీలత రాజు, కో ఆప్షన్ సభ్యులు సత్తయ్య, సయీద్, ప్రజాప్రతినిధులు గుడాల శ్రీకాంత్, బందారం రాజు, పాతూరి శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

43 వ వార్డులో...

43వ వార్డులో తెలంగాణ ప్రభుత్వం స్వచ్ఛదనం-పచ్చదనం ప్రవేశపెట్టిన ప్రోగ్రాంలో వార్డులో ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించారు. ఈ వార్డు కౌన్సిలర్ పయ్యావుల పూర్ణిమ ఎల్లం యాదవ్, వార్డు ఇంచార్జ్ సురేష్, ఆర్పి శ్రీమతి, ఆశ వర్కర్ సరూప, అంగన్వాడి టీచర్ శ్వేత, సురేఖ, మున్సిపల్ సిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

23వ వార్డులో....

సిద్దిపేట పట్టణంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని 23వ వార్డులో భారత్ నగర్‌లో స్థానిక నాయకులు, ఎస్ హెచ్‌జీలు, వార్డు యూత్ కమిటీ సభ్యులతో కలసి పర్యటిస్తూ వార్డు ప్రజలకు తడి, పొడి, హానికరమైన చెత్తను వేరు చేయు విధానము చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకం కరుణాకర్, ప్రబోజి దయాకర్, వడ్డేపల్లి సూర్యనారాయణ, అత్తిలి కృష్ణ, ప్రకాష్, శ్రావణ్ కుమార్, రవి, ఆర్పి లావణ్య, ఏఎన్ఎం శ్రీవాణి, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుబ్బాక

పురపాలిక పరిధిలోని అన్ని వార్డుల్లో విరివిగా మొక్కలు నాటడం ద్వారా పచ్చదనాన్ని పెంచుతూ మున్సిపాల్టీని స్వచ్ఛదనంతో నింపుదామని, ఇందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ ఐదు రోజుల 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పురపాలక సంఘ కార్యాలయం ఆవరణలో సోమవారం దుబ్బాకలోని మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, మొక్కల పెంపకం, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కళ్యాణం రమేష్ కుమార్, ఏఈ ప్రవీణ్‌రాజ్, మెప్మా సీఓ రేణుక, వర్క్ ఇన్స్పెక్టర్ బుస ప్రవీణ్, నోడల్ ఆఫీసర్ చక్రపాణి, జెడ్పీహెచ్ఎస్, కస్తూర్బా బాలికల పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, మెప్మా ఆర్పీలు, అంగన్వాడీ టీచర్లు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాక మున్సిపాలిటీని స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదామని, ఈ మహా యజ్ఞంలో మున్సిపల్ పరిధిలోని ప్రజలు భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ కళ్యాణం రమేష్ కుమార్ కోరారు. సోమవారం 'స్వచ్ఛదనం- పచ్చదనం' కార్యక్రమంలో భాగంగా దుబ్బాక పురపాలిక పరిధిలోని ధర్మాజీపేట వార్డులో 7వ, 8వ, 9వ వార్డుల కౌన్సిలర్లు దివిటి కనకయ్య, దుబ్బాక బాలకృష్ణ గౌడ్, బత్తుల స్వామిలతో కలిసి నిర్వహించిన ర్యాలీలో మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ పాల్గొన్నారు. ప్రతి ఇంటికి పండ్లు, పూలు, ఔషధ మొక్కల్ని ఉచితంగా పంపిణీ చేశారన్నారు. ప్రజలు తమ ఇళ్లతో పాటు ఖాళీ స్థలాల్లో విరివిగా మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతల్ని తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు, మెప్మా ఆర్పీలు, అంగన్వాడీ టీచర్లు, ఆశాలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ-చేర్యాల

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని చేర్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూప అన్నారు. స్వచ్ఛధనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం చేర్యాల పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి గాంధీ సెంటర్ వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో చైర్ పర్సన్ మాట్లాడుతూ మొక్కలు పెంచడం చాలా ముఖ్యమని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల శుభ్రత అవసరమని అన్నారు. ప్లాస్టిక్ వల్ల జరిగే నష్టాల గూర్చి వివరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.నాగేందర్, వైస్ చైర్మెన్ నిమ్మ రాజీవ్ రెడ్డి, కౌన్సిలర్లు చెవిటి లింగం, తుమ్మలపల్లి లీల, పచ్చిమడ్ల సతీష్, ఆడెపు నరేందర్, మున్సిపల్ మేనేజర్ ప్రభాకర్, ఆర్పీలు, అంగన్వాడీ టీచర్లు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

నవతెలంగాణ-రాయపోల్

పరిసరాల పరిశుభ్రత స్వచ్ఛ గ్రామాల నిర్మించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో విజయవంతంగా పూర్తి చేద్దామని ప్రత్యేక అధికారి బాబు నాయక్, ఎంపీడీవో బాలయ్య, తహసీల్దార్ దివ్య అన్నారు. సోమవారం రాయపోల్ మండల పరిధిలో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం ఈనెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఐదు రోజులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఐదు రోజులు గ్రామలలో ర్యాలీలు నిర్వహించాలనీ, నీటి నిల్వ ప్రాంతాలు వీధి కుక్కలను ఇంకుడు గుంతలను మొక్కలు నాటు ప్రదేశాలను ఫీవర్ సర్వే ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటింటికి తిరిగి సామూహిక ప్రదేశాలలో ఇంకుడు గుంతలు గుర్తించడం, ఉపయోగించుటకు అవగాహన కల్పిస్తామన్నారు. నీటి నిల్వ ప్రదేశాలు, చిన్నపాటి గుంతలు, మురికి కాలువలు, నీటి నిల్వను పరిశుభ్రత పాటించేలా చూడాలన్నారు. సీజనల్ వ్యాధుల పైన అవగాహన కల్పించాలి. వనమోత్సవం కార్యక్రమము ప్రభుత్వ కార్యాలయాలు, సామూహిక ప్రదేశాలను గుర్తించి మొక్కలు నాటే కార్యక్రమం ఇంటింటికి మొక్కలు పంచే కార్యక్రమం నిర్వహించారు. షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు అన్నింటిని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్, ఏపీవో రాములు, ఏపీఎం ప్రసాద్ రాజు, గ్రామ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సీసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, అంగన్వాడీ టీచర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ మిరుదొడ్డి

ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని తహసీల్దార్ గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి షఫీనా బేగం లు అన్నారు. మిరుదొడ్డి మండలం లింగుపల్లి గ్రామంలో స్వచ్ఛదనం పచ్చదనం అనే కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాలలో, గ్రామాల్లోని ఇంటింటా తిరిగి పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టి మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒకరు తప్పనిసరిగా వారి ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒకరిపై ఉందని తహసీల్దార్ సూచించారు. ప్రతి మహిళా తప్పనిసరిగా ఇంటి చుట్టూ పిచ్చి మొక్కలు, నీరు నిల్వ తో పాటు అపరిశుభ్రంగా ఉండకుండా చూడవలసిన బాధ్యత ప్రతి మహిళపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఉపాధ్యాయురాలు అనురాధ, ఆశ వర్కర్ బాలమని, వివోఏ మహేష్ పాటు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కోహెడ

నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని తహసీల్దార్ సురేఖ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రతిఒక్కరు ఇంటి పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను అలవర్చుకోవాలన్నారు. ప్రతి కుటుంబం సుమారు ఐదు మొక్కలను నాటాలని సూచించారు. అలాగే మండలంలోని తంగళ్ళపల్లి, రాంచంద్రాపూర్, శనిగరం, గుండారెడ్డిపల్లి, కూరెళ్ళ, ధర్మసాగర్‌పల్లి గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య ఆధ్వర్యంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి దెవేందర్ రాథోడ్, ఏపీఎం తిరుపతి, పాఠశాల హెచ్ఎం మహమూద్, కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి వేల్పుల వెంకటస్వామి, సుధాకర్, ముంజ శ్రీనివాస్‌గౌడ్, బొబ్బల కనకారెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు బీనవేని రాకేష్, ఏఎన్ఎం మంజుల, అంగన్‌వాడీ టీచర్‌లు, ఆశా కార్యకర్తలు, సీఏలు, మహిళా సంఘం అధ్యక్షురాలు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మర్కుక్ నూతన ఎస్ఐగా ఓడాటి దామోదర్

నవతెలంగాణ-మర్కుక్



మర్కుక్ నూతన ఎస్ఐగా ఓడా టి దామోదర్ సోమవారం మర్కుక్ పోలీస్ స్టేషన్లలో బాధ్యతలు చేపటారు. మర్కుక్ ఎస్ఐగా పనిచి చేసిన మధుకర్ రెడ్డి లాంగ్ లీవ్‌లో వెళ్ళాడు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలకు విఘా తం కలిగించకుండా పనిచేస్తా నని తెలిపారు. నేర రహిత మండలంగా ప్రజల సహకారంతో తన వంతు కృషిచేస్తానన్నారు.

చేర్యాల సబ్ రిజిస్ట్రార్‌గా మనోహర్

నవతెలంగాణ-చేర్యాల



చేర్యాల సబ్ రిజిస్ట్రార్ (ఎస్ఆర్ఓ)గా జె. మనోహర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఎస్ఆర్ఓగా బాధ్యతలు నిర్వహించిన ఆర్.కృష్ణయ్య కామారెడ్డికి బదిలీ పై వెళ్లగా ఆయన స్థానంలో కరీంనగర్ కార్యాలయంలో ఎం.వి ఆడిట్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న మనోహర్ బదిలీ పైన చేర్యాలకు వచ్చారు. వీరితో పాటు జూనియర్ అసిస్టెంట్లు గా వళి, మాణిక్యం బాధ్యతలు చేపట్టారు.

చేర్యాల మున్సిపల్ కమిషనర్‌గా నాగేందర్

నవతెలంగాణ-చేర్యాల



చేర్యాల మున్సిపల్ కమిషనర్‌గా ఎస్.నాగేందర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు గజ్వేల్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య ఇంచార్జిగా బాధ్యతలు నిర్వహించగా, పూర్తిస్థాయి కమిషనర్‌గా జీహెచఎంసీ పరిధిలోని యాప్రా మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న నాగేందర్ చేర్యాలకు బదిలీ పై వచ్చారు.

ప్రజావాణిలో భూ సమస్యపై ఫిర్యాదు

నవతెలంగాణ - తూప్రాన్



తూప్రాన్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రజావాణిలో తూప్రాన్ మున్సిపల్ పరిధిలో గల పదో వార్డు బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన శివ సత్తయ్య తనకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. శివసత్తయ్య భూమి సర్వేనెంబర్ 97 లో 32 గంటల భూమి 2004వ సంవత్సరంలో కొనుగోలు చేసి వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు.పాత పాస్ బుక్ రికార్డు ప్రకారం సత్తయ్య పేరు నమోదు కాగా అధికారుల నిర్లక్ష్యంతో కొత్తగా ధరణి ఏర్పాటులో తన పేరు నమోదు కాకపోవడంతో సంవత్సరాల తరబడి అధికారుల చుట్టూ తిరుగుతున్నా తనకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. భూమి లేకున్నా ఇతరులకు రికార్డు ఎక్కించుకోవడంతోపాటు లక్షల రూపాయలకు ఆ రికార్డును కొంతమంది ఇతరులకు అమ్ముకోవడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు అన్యాయం జరిగిందని తన పేరును రికార్డు లో ఎక్కించి తనకు కొత్త పాసుబుక్ మంజూరు చేయాలని తూప్రాన్ తహసీల్దార్ విజయలక్ష్మికి ప్రజావాణిలో వినతి పత్రం సమర్పించాడు. భూమి లేకుండా రికార్డు పొంది అక్రమాలకు పాల్పడిన వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

సంగమేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్



శ్రావణమాసం తొలి సోమవారం పురస్కరించుకొని పెద్ద శంకరంపేట మండల పరిధిలోని కొప్పుల్ ఉమా సంగమేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జాము నుండే భక్తులు సమీప కోనేటిలో పవిత్ర స్నానాలు ఆచరించి స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీలకు నిధులు కేటాయించకపోవడం దారుణం

నవతెలంగాణ-కోహెడ



రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీలకు నిధులు కేటాయించకపోవడం దారుణమని దళితమోర్చా మండల అధ్యక్షుడు దావ శేఖర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎస్సీ కార్పొరేషన్ స్వయం ఉపాధి రుణాలు, షెడ్యూల్డ్ కులాల సాంఘిక సంక్షేమ వసతి గృహాల పున్ణనిర్మాణం తదితర అంశాలకు రాష్ట్రబడ్జెట్‌లో ఎలాంటి నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారి ఎల్లయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ అభయహస్తంలో ప్రతి కుటుంబానికి రూ.12 లక్షల ఆర్థిక సహాయం అందజేయాలని, ఎస్సీ ఉప కులాల మాల, మాదిగ కార్పొరేషన్‌కు ఏడాదికి రూ.750 కోట్లు కేటయించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ దళితమోర్చా మండల ప్రధానకార్యదర్శులు తలారి సుధాకర్, చిట్యాల ఐలయ్య, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు బొమ్మగాని శివకుమార్ గౌడ్, బీజేపీ మండల కార్యదర్శి వేముల రమేష్, బీజెవైఎం నాయకుడు బండ సుమన్ యాదవ్, బీజేపీ గ్రామశాఖ అధ్యక్షుడు ముంజ సాగర్ గౌడ్, పార్టీ నాయకుడు ఎడ్ల రాజు, తదితరులున్నారు.

భీమ్రావును పరామర్శించిన నాయకులు

నవ తెలంగాణ-మిరుదొడ్డి

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు భూంపల్లి భీమ్ రావు పితృ యోగం అయిన విషయం తెలుసుకున్న పలువురు ప్రజా ప్రతినిధులు రాజకీయవేత్తలు భీమ్రావును పరామర్శించారు. సోమవారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు మద్దుల సోమేశ్వర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అడ్వకేట్ జనరల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు తెలంగాణ గారి కొండల్ రెడ్డి, భారతీయ జనతా పార్టీ నాయకులు పంజా విజయ్ కుమార్‌లు భీమ్రావు కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట కాజపూర్ మాజీ సర్పంచ్ మధు బాలగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి











నవతెలంగాణ-తొగుట

స్వచ్ఛత పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా వెంకట్రావుపేట గ్రామంలో ప్రత్యేక అధికారి తహశీల్దార్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామాలలో వీధులలో ఇంటి చుట్టుపక్కల ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు సహకరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ. అశోక్ రాజ్, పంచాయతీ కార్యదర్శి రవీందర్, అంగన్వాడీ జ్యోతి, వీణ, స్వప్న, ఆశా కార్యకర్తలు యాదమ్మ, భాగ్యలక్ష్మి, వినోద, గ్రామపంచాయతీ సిబ్బంది పిట్ల రాములు, చట్ల పల్లి కృష్ణ, వడ్డే కిష్టయ్య ఇదు గల్ల బాలస్వామి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - రాయపోల్

పరిసరాల పరిశుభ్రత స్వచ్ఛదనంతోనే గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయని దౌల్తాబాద్ మండలం ప్రత్యేక అధికారి లింగస్వామి, ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ అన్నారు. సోమవారం దౌల్తాబాద్ మండల పరిధిలో దొమ్మాట స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఐదు రోజులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఐదు రోజులు గ్రామలలో ర్యాలీలు నిర్వహించాలని, నీటి నిల్వ ప్రాంతాలు, ఇంకుడు గుంతలను, మొక్కలు నాటు ప్రదేశాలు, ఫీవర్ సర్వే తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఇంటింటికి తిరిగి సామూహిక ప్రదేశాలలో ఇంకుడు గుంతలు గుర్తించడం, ఉపయోగించుటకు అవగాహన కల్పిస్తామన్నారు. నీటి నిల్వ ప్రదేశాలు, చిన్నపాటి గుంతలు, మురికి కాలువలు, నీటి నిల్వను పరిశుభ్రత పాటించేలా చూడాలన్నారు. షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు అన్నింటిని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సయ్యద్ గఫర్ ఖాద్రి, ఏపీవో, ఏపీఎం, గ్రామ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సీసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, అంగన్వాడి టీచర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-తూప్రాన్

ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం తూప్రాన్ మండలం ప్రత్యేక అధికారి అయిన జడ్పీ సీఈఓ ఎల్లయ్య ఇస్లాంపూర్, గుండ్రెడ్డిపల్లి, మల్కాపూర్, నర్సంపల్లి గ్రామాల్లో కార్యక్రమాన్ని ప్రారంభించారు. తదనంతరం ఇస్లాంపూర్ గ్రామ ప్రజలతో, మండల స్థాయి అధికారురులతో,పాఠశాల విద్యార్థులతో కలిసి వీదులు తిరుగుతూ పరిసర ప్రాంతాలు పరిశుభ్రత పాటించాల్సిందిగా ప్రచారం చేస్తూ ర్యాలీ తీశారు. పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ శేషాద్రి, వివిధ గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఎన్.కల్పన, అరుణ, ఎపివో, గ్రామాఖ్య సంఘాలు, వైద్యాధికారులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పోతాన్ పల్లిలో..

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పోతాన్ పల్లి గ్రామంలో సోమవారం విద్యార్థులతో కలిసి ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధము,సీజనల్ వ్యాధుల గురించి,పరిసరాల పరిశుభ్రత గురించి, అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ పవన్ కుమార్ ,పంచాయతీ సెక్రెటరీ అశోక్,ఫీల్డ్ అసిస్టెంట్ యాదగిరి, అంగన్వాడి టీచర్ లలిత,సిద్ధమ్మ ,పల్లె దావకాన %మీన్రూ% సోనీ,ఆశా వర్కర్ స్వప్న , సిఏ షబానా ,వివో లీడర్ హేమలత, జడ్.పి. హెచ్.ఎస్ ప్రధానోపాధ్యాయులు బాగారెడ్డి, సహోపాధ్యాయులు హరికిషన్ రెడ్డి, భాస్కర్, నందు, సెహగల్ ఫౌండేషన్ ఆదిలక్ష్మి , ఇతర గ్రామ ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

మున్సిపాలిటీలో..

తూప్రాన్ పురపాలక సంఘ పరిధిలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ ఆధ్వర్యంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తూప్రాన్ ఆర్డీవో జయచంద్రా రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఆఫీస్ నుండి బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ మానవహారంగా ఏర్పడే బస్టాండ్ ఆవరణలో శ్రమదానం చేశారు.తదనంతరం పుట్టకోట్ల పాఠశాల అవరణలో చెట్లను నాటి, మున్సిపల్ చైర్పర్సన్ అధ్వర్యంలో విద్యార్థులకి నోట్ బుక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖాజా మోహినుద్దీన్, కౌన్సిలర్లు శ్రీశైలం గౌడ్, కుమ్మరి రఘుపతి, మామిడి వెంకటేష్,మున్సిపల్ మేనేజర్ రఘువరన్,జూనియర్ అసిస్టెంట్ దుర్గయ్య, మున్సిపల్ వార్డ్ ఆఫీసర్లు,మెప్మా ఆర్పిలు,అంగన్వాడీ టీచర్లు,ఆశ వర్కర్లు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ డిక్లరేషన్ల హామీలు అమలు చేయాలి











నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ చేవెళ్లలో ఎస్సీ డిక్లరేషన్ డిక్లరేషన్‌లో చేసిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు నత్తి శివకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం నాయకులతో కలిసి గజ్వేల్ తహసీల్దార్ కార్యయలంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో చేవెళ్ల నిర్వహించిన ఎస్సీ డిక్లరేషన్‌లో ఇచ్చిన ప్రధాన హామీలు అమలు చేయాలన్నారు. అంబేద్కర్ అభయహస్తం, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధికి రుణాలు, షెడ్యూల్డ్ కులాల సాంఘిక సంక్షేమ వసతి గృహాల పున్ణ నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని కోరారు. రాష్ట్ర బడ్జెట్లో ఎలాంటి నిధులు కేటాయించకపోవడాన్ని నిరశిస్తున్నమన్నారు. ఈ డిమాండ్లను వెంటనే నెరవేర్చి ఎస్సీలను ఆదుకోవాలని బీజేపీ ఎస్సీ మోర్చా కోరారు. అంబేద్కర్ అభయహస్తం కింద ప్రతి కుటుంబానికి రూ.12 లక్షల ఆర్థిక సహాయం అందజేయాలన్నారు. ఎస్సీ ఉప కులాలు, మాల, మాదిగ కార్పొరేషన్లకు ఏడాదికి రూ.750 కోట్లు కేటాయించాలన్నారు. ప్రతి ఎస్సీ కుటుంబానికి శాశ్వత ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఆర్థిక సహాయం అందజేయాలన్నారు. ఎస్సీ హాస్టల్స్ పున్ణ నిర్మాణానికి అవసరమైన నిధులు వెంటనే కేటాయించాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా యువతకు స్వయం ఉపాధికై సబ్సిడీ రుణాలకు ఏడాదికి రూ. వెయ్యి కోట్లు కేటాయించాలని, రాష్ట్ర ప్రభుత్వాన్నికి గుర్తు చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే, రాబోవు రోజుల్లో ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు కుడిక్యాల రాములు, ఉప్పల మధుసూదన్, జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నె శేఖర్, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

నవతెలంగాణ-తొగుట

ఎస్సి డిక్లరేషన్ అనుగుణంగా నిధులు కేటాయిం చాలని బీజేపీ ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు బెజుగామ ఆంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల సభలో హామీ ఇచ్చిన ప్రకారం ఎస్సీ డిక్లరేషన్ అనుగుణంగా నిధులు కేటాయించాలన్నారు. 1. అంబెడ్కర్ అభయహస్తంలో భాగంగా ప్రతి కుటుంబానికి రూ. 12 లక్షలు ఆర్థిక సహాయం అందజేయాలన్నారు. 2. ఎస్సీ ఉప కులాల (మాల, మాదిగ) కార్పొరేషన్‌లకు ఏడాదికి రూ.740 కోట్లు కేటాయించాలని తెలిపారు. 3. ప్రతి కుటుంబానికి శాశ్వత ఇల్లు నిర్మాణా నికి రూ. 5 లక్షలు ఆర్థిక సహాయం అందజేయాలని గుర్తు చేశారు. 4. ఎస్సీ హాస్టల్ పున్ణ నిర్మాణానికి అవసరం అయినా నిధులు వెంటనే కేటాంచాలని పేర్కొన్నారు. 5. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా యువతకు స్వయం ఉపాధికై సబ్సిడీ రుణాలకు ఏడాదికి రూ. వెయ్యి కోట్ల కేటాయించాలని చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ సిద్ధిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి బూరెడ్డిగారి విభీషణ్ రెడ్డి, నాయకులు ఐలిగొండ చంద్రశేఖర్ గౌడ్, నంట స్వామిరెడ్డి, వరదపల్లి నరసింహారెడ్డి, దాసరి కళ్యాణ్ దాస్ ముదిరాజ్, బుర్ర నరేష్ గౌడ్, పాగాల బాల్ రెడ్డి, సింధు మహేష్, బొడ్డు పోషయ్య తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ -దుబ్బాక

అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన చేవెళ్ల ఎస్సీ డిక్లరేషన్‌ను రాష్ట్ర సర్కార్ వెంటనే అమలు చేయాలని బీజేపీ దుబ్బాక మున్సిపల్ దళిత మోర్చా అధ్యక్షుడు గంభీర్‌పూర్ కనకరాజు డిమాండ్ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీ సామాజిక వర్గానికి నిధుల్ని కేటాయించలేదని నిరసిస్తూ బీజేపీ దళిత మోర్చా ఆధ్వర్యంలో సోమవారం దుబ్బాకలోని తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. బీజేపీ జిల్లా దళిత మోర్చా ఉపాధ్యక్షుడు మరాటి బాబు, నాయకులు ఆస రాజు, మోత్కుపల్లి బద్రీ, ఇస్తారిగల్ల యాదగిరి, ఇస్తారిగల్ల స్వామి, కనకయ్య, బాబు, సంజీవులు, శ్రీనివాస్ ఉన్నారు.

నవ తెలంగాణ- రాయపోల్

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా చేవెళ్ల సభలో ప్రకటించిన ఎస్సీ డిక్లరేషన్ అమలు చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు టెంకంపేట నర్సింలు అన్నారు. సోమవారం రాష్ట్ర బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షులు కొండేటి శ్రీధర్ ఆదేశాల మేరకు రాయపోల్ మండల తహసీల్దార్‌కి మెదక్ పార్లమెంట్ ఎస్సీ మోర్చా ఇంచార్జ్ మంకిడి స్వామి, బీజేపీ మండల అధ్యక్షులు రాజా గౌడ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల సమయంలో చేవెళ్లలో నిర్వహించిన ఎస్సీ డిక్లరేషన్ ఏర్పాటు చేస్తామని నిధులు ఇస్తామని తెలియజశారని, డిక్లరేషన్‌లో ప్రధానంగా అంబేద్కర్ అభయహస్తం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఉపాధి రుణాలు, షెడ్యూల్ కులాల వెనుకబడిన సాంఘిక సంక్షేమ వసతి గృహాల పునర్ నిర్మాణాలపై బడ్జెట్లో ప్రస్తావించకపోవడం బాధాకరమన్నారు. అంబేద్కర్ అభయాస్తం కింద ప్రతి కుటుంబానికి రూ.12 లక్షల ఆర్థిక సహాయం, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ. 750 కోట్లను కేటాయించాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా యువతకు స్వయం ఉపాధి కోసం ఏడాదికి వెయ్యి కోట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాయపోల్ మండల బీజేపీ మాజీ అధ్యక్షులుమాదాసు వెంకట్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శులు నీల స్వామి, కృష్ణ గౌడ్, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, ఎస్సీ మోర్చా మండల ఉపాధ్యక్షులు కరుణాకర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.